విడి ప్రతి రూ.15/-

ఆగస్టు 2011

# స్పందన

ఆధ్యాత్మిక మాస పత్రిక



పరమపదించిన

## ఆచార్య ఆరార్కె మూర్తి గారు

## చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను.

కీర్తన 23:6

# దైవజనులు మన ప్రియతమ ఆత్మీయ నాయన గారు ఆచార్య ఆరార్కే మూర్తి గారి అంతిమ యాత్ర


ఆచార్య ఆరార్కే మూర్తిగారి పార్థీవ దేహం


రామంత్‌పూర్ బాప్టిస్టు చర్చిలో సందేశమిస్తున్న డా॥ దేవ


వాహనంలోనికి పార్థీవ దేహాన్ని తరలింపు


రామంత్‌పూర్ బాప్టిస్టు చర్చికి పార్థీవ దేహాన్ని తరలించే ముందు డా॥ దేవ ప్రార్థన


నారాయణగూడ సమాదుల తోటలోనికి....


సోదరుడు కరుణాకర్ వివాహంలో తీసిన దైవజనులు ఆరార్కే గారి ఫోటో


గానం - బ్రదర్ ఏసుపాదాలు, బ్రదర్ భాస్కర్


పాటలు పాడుకుంటూ మందిరానికి



భూస్థాపనకు హాజరయిన అశేష ప్రజలు




అంతిమ యాత్ర


భౌతికంగా చివరి చూపు



# ఆచార్య ఆరార్కే మూర్తి నాయన గారికి అశ్రునయనాలతో ఆత్మీయ నివాళి!

**ప్రఖ్యాత రేడియో, టి.వి** ప్రసంగికులు ఆత్మీయ తండ్రి ఆచార్య ఆరార్కే మూర్తి గారు ప్రభువు పిలుపునందు ఈ లోకయాత్ర ముగించిన తరువాత రాస్తున్న మొట్టమొదటి వ్యాసం, మాటలివి. ఎక్కడ ప్రారంభించాలో, ఏం రాయాలో మాటలు పెగిలి రాని సంగ్దిద్దంలోనుండి పెల్లుబుకుతున్న మాటలివి. ముందుండాల్సిన మాటలు వెనుక, వెనుక ఉండాల్సిన మాటలు ముందు ఉండి... అవి వరుసలో లేకపోతే క్షంతవ్యున్ని!

దైవజనులు ఆచార్య ఆరార్కే గారు 'ఇక్కడ' ఈ లోకంలో లేరు, కాని 'అక్కడ' ప్రభువుతో శాశ్వత రాజ్యంలో ఉన్నారు. భౌతికంగా ఆయన లేని లోటు తీర్చలేనిది. వారి కీర్తి అజరామరం, ఎల్లప్పుడూ నిలిచి ఉండేది.

ఆరార్కే గారితో దాదాపు 30 సం॥రాలు 'ఆధ్యాత్మిక కుమారుడిగా' అవినాభావ సంబంధం నాకుండటం నిజంగా దేవుని కృపే! దేవసహాయం అనే నా పేరులోని మొదటి రెండక్షరాలు 'దేవా' అంటూ ఆప్యాయంగా ఆయన పిలుస్తూ ఉంటే అదో దివ్యమైన అనుభూతి. అది నా భాగ్యం, దైవ దీవెన! అనేక ప్రదేశాలు, రాష్ట్రాలు, ఇతర దేశాలు దైవజనునితో కలిసి ప్రయాణించే భాగ్యాన్ని ప్రభువు నాకు ప్రసాదించారు. నేను శుభవార్త ఛానల్ మొట్టమొదటి టివి కార్యక్రమాన్ని చేస్తున్నాము. శ్రీమతి ఆరార్కే మూర్తి **'మా ఆధ్యాత్మిక కుమారుడు దేవసహాయం నూతన కార్యక్రమాలు చేయటం మాకెంతో సంతోషం. దేవసహాయం మాకిచ్చే సహకార మంతటి కోసం నా ప్రత్యేక వందనాలు'** అని చెప్పిన ముచ్చటైన మాటల టేపులను నేను భద్రంగా దాచుకున్నాను.

అలాగే 'ఆరాధన ఛానల్' లో నేను కొత్తగా టి.వి కార్యక్రమాలు ప్రారంభించే సమయంలో దైవజనులు ఆరార్కే గారు **'నా ఆధ్యాత్మిక కుమారుడు ఈ కొత్త కార్యక్రమాలు చేయటం నాకెంతో సంతోషం'** అంటూ ప్రారంభ పలుకులు చెప్పారు. అంతే కాదు గోవింద పురంలో చర్చి గురించి ప్రజలకు చెప్పేటప్పుడు **'నేను దేవ'** ఈ పని చేస్తున్నాము అని చెప్పారు. ఈ మధ్యకాలంలో కొందరు ఆరార్కే గారి మాటల్ను మార్చాలని చూస్తున్నారు. అందుకే ఇవి ఉదహరించాను.



## నిరంతర ధ్యానం

ఈ దైవజనునిలో నేను గమనించిన, నేర్చుకున్న శ్రేష్ఠమయిన ఆధ్యాత్మిక అనుభవాలను కొన్ని మీ ముందుంచుతాను. 'దివారాత్రులు దేవుని వాక్యాన్ని ధ్యానించటం ఈ దైవజనునిలో ఉన్న అత్యంత ఉత్తమ లక్షణం!' ఎప్పుడైనా మధ్యరాత్రి మెళుకువ వచ్చి మాట్లాడాల్సిన పరిస్థితి వస్తే, వారు 'హైదరాబాద్‌లో ఉన్న అమ్మ గురించో, పిల్లల గురించో లేదా ఆ మరుసటి రోజు ఏదైనా ఓ పెద్ద ప్రయాణం ఉన్నా ఆ ప్రయాణపు ఏర్పాట్ల గురించో' ఆలోచించేవారు కాదు. అంత రాత్రి సమయంలో

### ప్రత్యేక గమనిక

**వచ్చే నెల సంచిక 'పరమపదించిన దైవజనులు ఆచార్య ఆరార్కే' గారి స్మృతికి చిహ్నంగా ప్రచురించ నున్నాము. ఆరార్కే గారికి మీ శ్రద్ధాంజలి, వారితో మీకున్న ఆత్మీయ అనుభవాలు రాసి పంపండి. మీ వద్ద దైవజనులు ఆచార్య ఆరార్కే గారితో తీసుకున్న ఫోటోలు ఉంటే అవి కూడా పంపించండి. వాటిని ఈ సంచికలో ప్రచురిస్తాము.**

కూడా, **'దేవసహాయం, రోమా 8. 28 ని గురించి నీవెప్పుడైనా ఆలోచించావా? ఎంతటి గొప్ప వచనం, ఎంతటి గొప్ప ఆధ్యాత్మిక సత్యాలు అందులో వున్నాయి'** అంటూ ఏదో ఒక బైబిలు వచనాన్ని గురించి చెప్పేవారు. 'దైవజనుడు దివారాత్రులు దేవుని వాక్యాన్ని ధ్యానించే అత్యుత్తమమైన, శ్రేష్ఠమయిన ఆధ్యాత్మిక లక్షణాన్ని కలిగిన దైవజనుడు'. దేవుని వాక్య వాగ్దానం మొదటి కీర్తన ప్రకారం 'దివారాత్రులు దేవుని వాక్యాన్ని ధ్యానించే వారు, నీటి కాలువల దగ్గర నాటబడి, ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చే చెట్టువలె ఉంటారు. వారు చేసేదంతా సఫలమవుతుంది. ఆరార్కే గారు ఏ సేవ చేసినా అది సఫలమే! వేలాదిగా ఆయన వివాహాలు చేశారు, ఆ దంపతులందరూ హాయిగా పిల్లపాపలతో క్షేమంగా వున్నారు. అంతే కాదు ఆయన వేలాదిగా రేడియో ప్రసంగాలు, సభల్లో ప్రసంగాలు, అలాగే టి. వి ప్రసంగాలు చేసినా ఎలాంటి నోట్సు వినియోగించేవారు కాదు. వారి గుండెలనిండా యేసయ్య మాటలే కాబట్టి వారు అలా సాధారణంగా మాట్లాడినా, లేదా ప్రసంగించినా దేవుని మాటలే ఆయన నోటి వెంట వచ్చేవి.

దైవజనుడు ఎల్లప్పుడూ ఓ మాట అనేవారు. 'గాస్సిప్ ది గాస్పల్' అంటే సాధారణంగా మనం మాట్లాడుకునే మాటల్లో సువార్త ఉండాలి, అని అర్థం! వారి మాటలు అలాగే ఉండేవి. వారు నోరు తెరచి ఏదైనా మాట్లాడారు అంటే 99 శాతం దేవుని మాటలే ఉండేవి.

### తెలుగు మమకారం

'తెలుగు ప్రజలు యేసయ్యను సరైన విధంగా అర్థం చేసుకోవాలనే' భారం వారి హృదయంలో ఎక్కువగా ఉండేది. పండితులైన వారు, అన్యులైన వారు యేసయ్యను గురించి ఏదైనా విమర్శిస్తే వారి మీద కోపాన్ని ప్రదర్శించే వారు కాదు గాని 'యేసయ్యను అపార్థం చేసుకుంటున్నారే!' అని ఎముకలు విరిచినంతగా బాధ పడేవారు. వారి కోసం ప్రార్థించే వారు.

చివరి రోజుల్లో వారు ఫోన్‌లో చెప్పిన మాట నేనెన్నడూ మరువలేను. దేవసహాయం 'యేసు ప్రజా రక్షకుడు', అనే మాట చెప్పి ఎంతగానో వివరించేవాడు. నీవు కట్టించబోయే ప్రార్థనా మందిరాలన్నిటికీ 'ప్రజా ప్రార్థనా మందిరము' అని పేర్లు పెట్టు అన్నారు.

క్రైస్తవ్యంలో వాడుక భాషను పరిచయం చేసిన ఘనత ఆరార్కే గారిది. వారి భాష, యాస అటు పండితులను, ఇటు పామరులను సహితం ఆకర్షించేది. 'అంతా యేసే... నా భాష, నాయాస అంతా యేసే....' అని ఓ మంచి పాటనుకూడా ఆరార్కే గారు రాశారు.



2008 సంII నవంబరు, డిసెంబరు నెలల్లో లండన్, అమెరికా దేశాలకు మేమిద్దరం కలిసి ప్రయాణాలు చేశాము. ఆ సమయంలో ఓ అమెరికన్ చర్చి వారు తమ సంఘానికి వచ్చి వాక్యాన్ని బోధించాలని ఆహ్వానించారు. 'నేను నా తెలుగు ప్రజల కోసం అమెరికా వచ్చాను, వారి దర్శించటానికే నాకు సమయం సరిపోవటం లేదు, నేను రాలేను దయచేసి క్షమించండి' అంటూ సున్నితంగా ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు. తెలుగు ప్రజలు యేసయ్యను గురించి తెలుసుకోవాలని, ఆధ్యాత్మిక రంగంలో ముందుండాలని ఎంతగానో ఆశించినవారు ఆచార్య ఆరార్కే గారు.

### డబ్బు - మంచి సేవకుడు

దైవజనులు ఆరార్కే గారు డబ్బు సంపాదించాలని ఏనాడు ఆశించలేదు. ఆయన డబ్బు సంపాదన మీద దృష్టి ఉంచితే కోట్ల రూపాయలు వచ్చి ఉండేవేమో! అయితే ప్రజలు ఆయన్నెంతో అభిమానించే వారు, వారి సేవ కోసం కానుకలు ఇచ్చేవారు.

ఓ సారి ఆరాధన ఛానల్‌లో టివి కార్యక్రమాలు చేస్తున్నాము. వరద బాధితుల సహాయార్థం టివి ప్రసంగికులందరూ ఆర్థికంగా చేయూతనివ్వమని ప్రజలను కోరుతున్నారు. ఆరార్కే గారి వంతు వచ్చే సరికి ఆరాధన ఛైర్మన్స్ శ్రీమతి ఉషా గారితో 'అమ్మా, నేనెప్పుడూ కానుకల కోసం అడగలేదు, వారి కోసం నేను ప్రార్థన చేస్తాను' అన్నారు. మీ దృష్టికి తేవాలని నేను ప్రయత్నిస్తున్న విషయం డబ్బు విషయానికొచ్చే సరికి డబ్బు మనకు యజమాని కాకూడదు డబ్బు మనకు మంచిసేవకుడు అని నొక్కి వక్కాణించేవాడు.

### ఆరార్కే దంపతులు

ఈ సమయంలో శ్రీమతి ఆరార్కే అమ్మ గారిని మనం తప్పక జ్ఞాపకం చేసుకోవాలి. అమ్మ గారు ఎంత దీనురాలో మాటల్లో వర్ణించలేము. ఇంత పేరు ప్రఖ్యాతులున్న ఆరార్కే గారి భార్య అయినా ఎంతో తగ్గింపు స్వభావం ఆమె స్వంతం! సాధారణమైన వస్త్రధారణ, పాదాలకు స్లిప్పర్స్ మాత్రమే

వాడేవారు. ఆడంభరాలకు పోని మనిషి! కుళ్లు కుతంత్రాలు ఎరుగని మనిషి. ఒక్క మాటలో చెప్పాలంటే భర్తకు తగ్గ భార్య. అమ్మ గారంటే ఆరార్కే గారికి ఎనలేని ప్రీతి! నేననుకుంటాను ఆరార్కే గారు చనిపోవటం అనేది అమ్మ గారు చనిపోయిన మరుసటి రోజునుండే ప్రారంభమయింది. అమ్మగారే గనక ఉండియుంటే ఇంకా కనీసం పదేళ్లయినా ఆరార్కే గారు బతికియుండే వారనుకుంటాను.

**రేడియో సేవ**

దాదాపు మూడు దశాబ్దాలుగా ఆకాశవాణి తరంగాలపై వారి స్వరం వినిపించింది. ప్రతి స్పందనగా లక్షలాది ఉత్తరాలు వచ్చాయి. ఆ ఉత్తరాలకు జవాబివ్వటానికి నలుగురు లేక ఐదుగురు పనిచేస్తూ ఉండేవారు. ప్రభువు చిత్తమైతే మరో 5 సం॥రాలు 2016 వరకూ ఆరార్కే నాయనగారి ప్రసంగాలు కొనసాగుతాయని ట్రాన్స్ వరల్డ్ రేడియో స్టేట్ కోఆర్డినేటర్ సోదరులు విజయ్ బాబ్జి గారు అన్నారు.

వెలుగు ఛానల్, శుభవార్త ఛానల్, రక్షణ ఛానల్, ఆరాధన ఛానల్స్ వారు ఆరార్కే గారి టివి ప్రసంగాలను వందలకొలది రికార్డు చేశారు. ఆంధ్ర క్రైస్తవ కీర్తనలలోని 'యేసుతో ఠీవిగాను పోదమా' అనే పాటలోని.. మాట 'యేసుతో టి. వి లోకి పోదమా' అంటూ ఛలోక్తి విసిరేవారు ఆరార్కేగారు. ప్రత్యేకించి ఆరార్కే గారి పరలోక పిలుపు ప్రసారాలను రక్షణ ఛానల్, ఆరాధన ఛానల్ ఇచ్చిన ప్రాముఖ్యత అంతా, ఇంతా కాదు. ఆరార్కే గారి జ్ఞాపకార్థ సభ ఆరాధన ఛానల్ లో లైవ్ వస్తుంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు టివిలను అంటిపెట్టుకుని ఉన్నారంటే నమ్మండి! ఆరాధన ఛానల్ వారు రికార్డు చేసిన ఆరార్కే గారి కార్యక్రమాల్లో ఆరార్కే గారికి మంచి, మంచి సూట్స్ వేసి ఎంతో అందంగా చూపించారు. వారికి మనందరి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు!

**కౌన్సిలింగ్**

'వ్యక్తిగతంగా కౌన్సిలింగ్ చేయటం' ఆరార్కే గారికి ఇష్టమైన వ్యాసాంగం. ప్రజలు వారి కష్టాలు, బాధలు ఎంత సేపు చెప్పినా విసుక్కోకుండా వినేవారు. తాను ఏదైనా సాయం చేయగలిగితే, ఎవరితోనైనా మాట్లాడిల్సిన అవసరం వస్తే మాట్లాడుతాను అనేవారు. దానిని గురించే అనేక సార్లు ప్రస్తావించి, వారి బాధను తమ స్వంత బాధగా భావించేవారు. 'నాయన గారూ, మనకున్న సమస్యలే బోలెడన్ని ఉన్నాయి, వేరేవారి సమస్యలగురించి, ఆలోచించి బాధ పడటం ఎందుకు?' అనే వాణ్ని. అయినా వారికేదైనా ఓ పరిష్కారం దొరికితే బాగుండు! అనేవారు.

**రచనలు**

రాయటం అంటే దైవజనులు రాయసం గారికి ఎంతో ప్రీతి. మీకో విషయం చెప్పనా? రాసి, రాసి పెన్ పట్టుకునే వారి రెండు వేళ్ల మధ్యను కాయలు కాచినవి, అంతగా రాయటాన్ని ప్రేమించే వారు. 'స్టెనో గ్రాఫర్' ఎవర్నైనా నియమించినా సరే మధ్యరాత్రి లేచి కూచొని రాసుకుంటే ఉండేవారు. వారు చాలా ఫాస్టుగా రాస్తారు కాబట్టి వారు రాసిన ప్రసంగాలన్నిటిని మరలా ఫెయిర్ కాపి చేసేవారము. దైవజనునితో సన్నిహిత సహవాసం ఉన్నవారికి ఆయన రాసే బాణి బాగా అర్థమయ్యేది.

కుటుంబ సమస్యలతో సతమతమయి ఆత్మహత్యా ప్రయత్నానికుపక్రమించే అనేకమంది ఆరార్కే గారి ప్రసంగాల తరువాత అలాంటి ప్రయత్నాలు మానుకుని ప్రభువు కోసం జీవించటానికి తీర్మానించుకున్నారు.

**కాపాడాయి**

వారి వ్యాసాలు కూడా అనేక మందిని కాపాడాయి, అని దేవుని మహిమకోసం నేను చెప్ప గలను. అవి నేను కొత్తగా స్పందన సంపాదకునిగా




బాధ్యతలు చేపట్టిన రోజులు. ఓ రోజు దైవజనునికి 14 పేజీల ఉత్తరం వచ్చింది. చదవమని నాకిచ్చారు, ఆ ఉత్తరం ఆసాంతమూ నేను చదివాను. ప్రకాశం జిల్లాలోని ఓ గ్రామంలో సామ్యేలు గారు అని పెద్దాయన ఉండేవారు. పెద్ద వయసులో ఆయన భరించలేని కష్టం ఒకటి వచ్చింది. ఓ రోజు ప్రయాణంలో తన ఒకే ఒక్క కుమారుడు, కోడలు, మనుమడు, మనుమరాలు నలుగురు ఒక్కసారే ఏక్సిడెంట్‌లో చనిపోయారు. ఆ దిగులుతోనే సామ్యేలు గారి భార్యకూడా కాలం చేసింది. సామ్యేలు గారు ఒంటరి అయిపోయారు. జీవితంలో నా అన్నవారు బంధువులు ఎవరూ లేరు. నేనెందుకు, ఎవరికోసం బతకాలి? అనే ప్రశ్న సామ్యేలు గారిని ఎంతగానో వేధించేది. చివరకు తనుకూడా జీవితాన్ని ముగిస్తే సరిపోతుంది అని ఆత్మ హత్య చేసుకోటానికి, పురుగులు మందు తెచ్చి ఇంట్లోపెట్టుకున్నాడు. ఇక తన జీవితంలో అదే చివరి రోజు... ఆలోచించుకుంటూ ఉండగా..

'పోస్ట్' అని పోస్టుమాన్ అరుపు వినబడింది.

'ఈ లోకంలో నా అన్నవాళ్లు నాకెవరూ లేరు కదా! నా కెవరు ఉత్తరం రాస్తారబ్బా' అనుకుంటూ కవరు అందుకున్నాడు. అది స్పందన మాస పత్రిక. కవరు మీద ఉన్న యోహాను 14.27 'నా శాంతినే మీకనుగ్రహిస్తున్నాను. మీ హృదయాలను కలవరపడనియ్యకండి' అనే అనే దేవుని మాటలు ఎంతగానో సామ్యేలు గారిని ఊరడింప జేశాయి. అంతే ఆత్రంగా ఆ పుస్తకాన్ని తెరచి చూచాడు. దేవుని కృప ఎంత గొప్పది అంటే.. ఆ నెల పత్రికలోనే దైవజనులు ఆత్మ ప్రేరేపణతో 'ఆత్మ హత్యలు' అనే వ్యాసాన్ని రాశారు. ఆసాంతమూ ఆ వ్యాసాన్ని చదివి, తన ఆత్మ హత్యా ప్రయత్నాన్ని విరమించుకొని దేవుని కోసం బతకాలని తీర్మానం చేసుకుని సువార్త కరపత్రాలు తెప్పించుకుని ఆ గ్రామం, పరిసర గ్రామాలలో అవి పంచుతూ జీవితాన్ని కొనసాగించటానికి తీర్మానం చేసుకున్నాడు సామ్యేలు గారు. దేవునికి స్తోత్రాలు.

అలా వారి మాటలు, రాతలు అనేకమందికి ఆశీర్వాదాలను పంచి ఇచ్చాయి.



**సేవా ప్రయాణాలు**

ఆరార్కే గారి ఇష్టమైన మరో వ్యాసాంగం సేవలో ప్రయాణాలు చేయటం! ఎంత ప్రయాణానికైనా అలసిపోయేవారు కాదు. ఎలాంటి సింపుల్ ప్రయాణానికైనా 'కాదు' అనేవారు కాదు. ఓ చిన్న మొపైడ్ మీదైనా ఎక్కేవారు, రిక్షా అయినా ఎక్కేవారు. ఆటో, బస్, రైలు, విమానం ప్రయాణ వసతులు ఏవైనా గమ్యం చేరటమే ప్రాముఖ్యమనేది వారి భావన. 'నేనింత పేరు ప్రఖ్యాతులు గలవాణ్ని కదా నాకింత చిన్న ప్రయాణపు సౌకర్యమా? లేదా ఇలాంటి చిన్న వసతి సౌకర్యమా? అని ఏనాడు వారు అనేవారు కానే కాదు. రాత్రి సభ రెండు గంటలకు అయిపోయినా మరుసటి రోజు సభ ఉన్న స్థలానికి ఆ మధ్యరాత్రే వెళ్లిపోదాం అని ప్రయాణం చేసేవారు. అంతటి ప్రయాణాలు చాలా సార్లు నేనే వారితో చేయలేకపోయేవాణ్ని! ప్రభువు సేవలో ప్రయాణాలను ఆయన ఎంతో ఎంజాయ్ చేసేవారు!

**అజాత శత్రువు**

ఆరార్కే గారంటే ఇష్టపడనివారు, ఆరార్కే గారితో శత్రుత్వం ఉన్నవారు ఎవరైనా ఉన్నారా? అని భూతద్దంలో చూడాలి అంటే అతిశయోక్తి కాదు. ఎలాంటి వ్యక్తినైనా ప్రోత్సహించటం దైవజనునిలో ఉన్న సుగుణం! వారితో కాసేపు మాట్లాడితే చాలు ఎంతటి నిరాశా, నిస్పృహలకు లోనైన వ్యక్తి కూడా కొండంత బలంతో తిరిగి వెడతాడు.

**ప్రోత్సాహం**

ఎలాంటి మనిషినయినా ప్రోత్సహించి జీవితంలో వారిని నిలబెట్టడం ఆరార్కే గారి ప్రత్యేకత. ఎవర్నీ చులకనగా చూడడు. ఆ వ్యక్తిలోని తలాంతులేమిటో ఇట్టే గమనించి ప్రోత్సహిస్తారు. దైవజనుడు ప్రోత్సహిస్తున్నాడు కదా, ఉప్పొంగి దైవజనుడు ఆశించిన మేరకు జీవితాలను సరిచేసుకోలేని అభాగ్యులు కూడా ఉన్నారనుకోండి! వ్యక్తిగతంగా మనుష్యులను గురించి శ్రద్ధ వహించేవాడు. అపకారాన్ని మనసులో ఉంచుకోడు. తనకు కీడు చేసిన వారిన సహితం క్షమించి అక్కున చేర్చుకునే వారు! అరే, ఈ మనిషి ఆరార్కే గారిని ఇంత దూషించింది కదా, ఇలాంటి వ్యక్తినా దగ్గరకు తీసింది, అని ఆశ్చర్యం కలిగించేది!

అంతటి ఘనకీర్తి కలిగిన ఆచార్య ఆరార్కే గారు ఆ లోకయాత్ర ముగించారు. అమ్మ గారు చనిపోయాక నేను ఇంటికి వెళ్లలేక పోతున్నాను, ఇంటిలో ఉంటే అమ్మే గుర్తుకువస్తుంది. నేను సేవలో ప్రయాణంలో ఉండగానో దేవుని వాక్యాన్ని బోధిస్తూ ఉండగానో ప్రభువు దగ్గరకు వెళ్లిపోవాలని సన్నిహితులతో తరచూ అంటూ ఉండేవారు. అయితే అనివార్య కారణాలు, పెద్ద వయసులో వచ్చే కొన్ని అనారోగ్య సమస్యల మూలకంగా కొన్ని నెలల పాటు ఆయన పడకలోనే ఉండిపోయారు.

జులై 15 సాయంత్రం సుమారు 3 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. దేవుని కుమారుడు 'యేసయ్య' సన్నిధిలోనికి ప్రవేశించారు. 17వ తేది ఆదివారం సాయంత్రం 3 గంటలకు హైదరాబాద్‌లోని నారాయణగూడ సమాధులతోటలో వారి పార్థివ దేహాన్ని శ్రీమతి వరలక్ష్మి ఆరార్కే గారి సమాధి ప్రక్కనే ఉంచారు.



జులై 20న సికింద్రాబాద్ సెంటినరీ బాప్టిస్టు చర్చిలో వారి జ్ఞాపకార్థ సభ జరిగింది. దైవజనులు ఎందరో పాల్గొని వారి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ విషయాలన్నిటిని ప్రత్యక్ష ప్రసారం ద్వారా సర్వలోకానికి వెల్లడి చేసిన ఆరాధన ఛానల్ అధినేతలకు జేజేలు!

1976 - 2011 35 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

# స్పందన
ఆధ్యాత్మిక మాసపత్రిక

*The largest circulated Telugu Christian monthly since 35 years*

ఆగష్టు 2011 సంపుటి 35 సంచిక 8

వ్యవస్థాపకులు
పరమపదించిన
**ఆచార్య ఆరార్కే మూర్తి**
ప్రచురణకర్త, సంపాదకులు
**డా॥ దేవసహాయం దండల**
గౌరవ సలహాదారులు
**ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి**
సహకారం
**పాస్టర్ పి. సురేశ్ బాబు**
సంపాదక వర్గం
**బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, బ్రదర్ ఆర్. ఎలీజై, రెవ. కె. జాన్ మోజెస్, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్**
సహాయ సంపాదకులు
**బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్**

## ఈ సంచికలో..

| | |
|---|---|
| అశృనివాళి | 1 |
| మనోనేత్రాలు | 10 |
| దేవుడు వాడుకొను మనుష్యుడు | 12 |
| హృదయశుద్ధి | 14 |
| మానవనైజం | 16 |
| పవిత్రభూమి యాత్ర | 18 |
| క్లుప్తప్రసంగాలు | 21 |
| ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం | 22 |
| నిజ స్వాతంత్ర్యం | 24 |
| పగిలిన కుండ | 26 |

మా అడ్రస్
**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**
**51-4-12, ఇ.ఎస్.ఐ హాస్పటల్ రోడ్,**
**గుణదల, విజయవాడ - 520 004,**
***E-mail: spandana1976@gmail.com***

**సర్క్యులేషన్, పుస్తకాలు, సిడిల కోసం ఫోన్స్ :**
**0866- 2456547, మొబైల్: 9490 11 3300**

**సభలు, ప్రత్యేక విషయాలు, అత్యవసర ప్రార్థనల కోసం మాత్రమే డా॥ దేవ, సెల్. 994 833 5222**

## చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశాల్లో |
|---|---|---|
| 1 సంవత్సరం | ₹ 150 | $ 20 |
| జీవిత సభ్యత్వం | ₹ 2000 | $ 200 |
| పోషక సభ్యత్వం | ₹ 150 (ప్రతినెల) | $ 20 |

### ప్రత్యేక మనవి

అందరికీ చందా అందుబాటులో ఉండాలని 150 రూ.లుగా ఉంచాము. వాస్తవానికి సుమారు 200 రూ.లు పైగా ఖర్చవుతుంది గనుక 200 రూ.లు పంపగలిగిన వారు, కానుకలు పంపగలిగిన వారు ఈ సేవకోసం ప్రార్థించి, ప్రభువు మిమ్మును ప్రేరేపించినట్లు సహకరించాలని మనవి. ఇప్పటికే ఈ సేవలో ఆర్థికంగా సాయపడుతున్నవారికి మా ప్రత్యేక వందనాలు. మీరు పంపే చెక్కులు, డ్రాఫ్టులు, యం. ఓలు స్పందన **(SPANDANA)** పేరు మీద పంపాలని మనవి. వెంటనే మీకు స్పందన ఆఫీసునుండి ఉత్తరం పంపిస్తాము. దేవుడు మిమ్మును దీవించును గాక!

**అకౌంట్ పేరు "స్పందన" (SPANDANA)**

**ఆంధ్రాబ్యాంక్, గుణదల (బ్రాంచ్), విజయవాడ**
**ఆన్‌లైన్ అకౌంట్ నం. 015810100016691**
**ISFS Code - ANDB0000158**

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,రామవరప్పాడు (బ్రాంచి), విజయవాడ**
**ఆన్‌లైన్ అకౌంట్ నం. 31541230212**
**IFSC Code - SBIN0011100**

గమనిక - ఆన్‌లైన్ కానుక పంపిన వెంటనే వివరములు ఫోన్ ద్వారా గాని, SMS ద్వారా గాని మాకు తెలియజేయాలని మనవి

## స్పందన ఆఫీసుకు రావాలంటే...

విజయవాడలో, గుణదల ఇ.యస్.ఐ హాస్పటల్ రోడ్‌లో ఉన్న పాత పంచాయితి ఆఫీసు సెంటర్‌కు రావాలి. అక్కడ ఉన్న దేవాలయం ప్రక్కనే ప్రగతి నివాస్ అపార్ట్‌మెంట్స్, మొదటి అంతస్థులో రెండో ఇల్లు FF2
**ఆఫీసు సమయం ఉ॥ 10 నుండి సా॥ 6 గం.**

Printed, Published and owned by **DEVA SAHAYAM DANDALA** Printed at **Spandana Offset Printers,** Suryaraopet, VJA-2. Ph:2430148, For Spandana Graphics & Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada




### ఆర్కే గారు లేని లోటు....

దైవజనులు ఆరార్కే మూర్తి గారు ఇకలేరు అనే వార్తను జీర్ణించుకోలేకుండా ఉన్నాము. ఆరార్కే జరిగించిన మా బంధువుల వివాహానికి నేను హాజరయ్యాను. చాలా ఘనంగా ఆ వివాహం జరిగింది. ఆరార్కే గారు తెల్లని బట్టలు ధరించి నవయువకుడిలా, వారూ ఓ పెళ్లి కొడుకులా కనిపించారు. సం॥ రోజుల్లోనే ఎంత మార్పు? వారి ద్వారా ప్రారంభమయినా ప్రతి సేవా కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగాలని, ప్రత్యేకించి స్పందన మాస పత్రిక ప్రతి నెలా నూతన హంగులతో వస్తున్నట్టు ఇక ముందుకూడా ప్రభువు మహిమకోసం వెలుగొందాలని ప్రార్ధిస్తున్నాము. ఆరార్కే గారి ఆధ్యాత్మిక అభిషేకపు దుప్పటి ఇప్పుడు డా॥ దేవ గారి పడింది. నూతన ఆత్మ అభిషేకంతో విజయవంతంగా ముందుకు కొనసాగాలని మా ప్రార్ధన.

**- పాస్టర్ దానియేల్, మధిర**

### ధైర్యపరచింది

ప్రియులైన స్పందన వారికి వందనములు. స్పందన నిజంగానే ఎందరినో స్పందింపజేస్తుంది. ప్రతిపేజి విలువగలదిగా వుంది. మెదడుకు మేత మేము మిస్‌అయిపోతున్నాం. ఒక ప్రకటన వెనుక గ.ను.క ప్రింటు చేయండి ప్లీజ్. క్లుప్త ప్రసంగాల వలన నూతనంగా తయారైన సువార్తికులకు దైవజనులకు చాలా ఆదరణకరంగా వుంది, సహాయకారిగా వుంది. "మనలోమాట", "భయాన్ని జయించాలంటే" ఆర్టికల్స్ చాలా ధైర్య పరచాయి. యెహోవా భయము ఐశ్వర్యము ఆర్టికల్ చాలా చాలా నచ్చింది. అనిల్‌కుమార్‌గారి పాట యిచ్చినందుకు చాలా వందనాలు(థ్యాంక్స్). ప్రకటన గ్రంధ పరమసత్యాలు ఆచార్య ఆరార్కేగారి వల్ల గుర్తించని మంచిగొప్ప మర్మాలు తెలిసినవి. చాలా కృతజ్ఞతలు. బైబిల్‌లోని పేర్లు వాటి అర్ధాలు మా గృహంలో మంచి డిక్షనరీ తయారు చేసుకోవన్న తలంపుతో అన్నీ బైండిగ్ చేయాలన్న ఆశ కల్గింది. మీ టీం అందరికీ వందనాలు

**బి. శారాఅబ్రాహం, కాకినాడ.**

### నిగూఢమైన సత్యాలు

ప్రభువునందు దైవజనులకు వందనములు. 20-7-2011న శుభవార్త చానెల్‌లో ఆధ్యాత్మిక ప్రసంగమును విన్నాము. చాలా ప్రయాసతో మీరు ప్రచారము చేయుచున్నారు. మీకు అభివందనములు. యింకను స్పందన దినదినము అభివృద్ధి పధములో నడవాలని మా ఆకాంక్ష. మీ పరిచర్యను మేము శ్లాగించుచున్నాము.

**కె. శామ్యూల్, కడియం.**

### ఆ స్వరం ఇక వినలేమా?...

దైవజనులు దేవసహాయం గారికి వందనాలు. ఆరార్కే మూర్తి గారు ఇహలోక యాత్ర ముగించారు అని తెలిసి విభ్రాంతి చెందాను. చిన్న తనం నుండి ఆరార్కే గారి రేడియో సందేశాలు అంటే నాకు ఎనలేని ప్రీతి. 'మీరంతా బాగున్నారా? రండి, రేడియోకు దగ్గరగా కూచోండి' అంటూ వారు మాట్లాడుతూ ఉంటే మాతో వ్యక్తిగతంగా మాట్టాడుతున్నారా? అన్నట్టుండేది. ఆ ప్రేమ మూర్తి కంఠ స్వరాన్ని ఇక రేడియోలో కూడా వినలేమా?

**దేవిడ్, మహబూబ్‌నగర్**

**ఎడిటర్ - సోదరా మీలాగే అనేక మంది బాధ పడుతున్నారు. ఎన్నో ఫోన్ కాల్సు వచ్చాయి. టిడబ్యుఆర్ స్టేట్ కోఆర్డినేటర్ సోదరులు విజయ బాబ్జి గారు మాట్లాడుతూ ప్రభువు చిత్త ప్రకారం మరో 5 సం॥ రాలు ఆరార్కే గారి ప్రసంగాలు ప్రసారమవుతాయన్నారు. అలాగే ప్రతి బుధవారం ఉ॥ ఆరాధన ఛానల్ మరో 100 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తున్నారు. ఇక మన స్పందన మాస పత్రికలోనయితే ప్రభువు వచ్చే వరకు ఆరార్కే గారి రచనలు వ్యాసాలు ప్రచురమవుతూ ఉంటాయి. ఆరార్కే గారు భౌతికంగా మరణించినా వారి సందేశం ఎల్లప్పుడూ నిలచి ఉంటుంది. దైవాశీస్సులు**

## ఆణిముత్యాలు

భవిష్యత్తు చరిత్రనే ప్రవచనం అంటాము. ప్రవచనం నెరవేరితే చరిత్ర అవుతుంది. విశ్వాసికి వర్తమానకాలం ముఖ్యం. గతం గతించింది. భవిష్యత్తు ప్రభువు చేతిలో ఉంది. హెబ్రీ 10:23 **"వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు. గనుక మన నిరీక్షణ విషయమై మనము ఒప్పుకొన్నది నిశ్చలంగా పట్టుకొందాము".** విశ్వాసులు ప్రార్థిస్తారు. గాని, అడుగుతున్న వాటిని పొందినట్లే నమ్మాలి. భవిష్యత్తు కాదు. ఇప్పుడే మనం మరిచిపోయే కాలం వర్తమానకాలం. భూతకాలం మరువరు. భవిష్యత్తును గురించిన ఆందోళన మానరు. అందుకే ప్రార్థనలు ఫలవంతం కావు. ఫిలిప్పీ 4:19 దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మన ప్రతి అవసరమూ తీరుస్తాడు. దేవుని విమోచనాత్మకమైన చిత్తమే జయిస్తుంది. ఆయన మాట వింటే ఆయన కోరిక నీవు తీరిస్తే ఆయన ఆజ్ఞ పాటిస్తే దేవుడు తన విశ్వసనీయతను రుజువు పరుస్తాడు.

విశ్వాసి తన జీవితంలో ప్రతి విభాగాన్ని యేసుకు అప్పగిస్తాడు. ఆయన ఎంతైనా నమ్మదగినవాడు. తన కుమారుడైన యేసుతో సహవాసానికి మనలను పిలిచిన దేవుడు విశ్వసనీయుడు. హెబ్రీ 13:8 యేసుక్రీస్తు నిన్న నేడు ఒకేరీతిగా ఉన్నాడు. అవును, యుగయుగాలకు ఒకేరీతిగా ఉంటాడు. క్రైస్తవులు తమ పాపాలు, వ్యక్తిగతంగా ఒప్పుకోవాలి. విశేషించి తమ జాతీయ పాపాలు సామూహికంగా ఒప్పుకోవాలి. దేవుడు క్షమించి మన దేశాన్ని జాతిని స్వస్థపరుస్తాడు. దానియేలు 9వ అధ్యాయములో తనకు తాను తన జాతిలో సంయుక్తపరచుకొని పశ్చాత్తాప్తుడై ప్రార్థించాడు. "తండ్రీ మేము పాపం చేశాము. నీ మాట వినక తిరుగుబాటు చేశాము" అంటూ విజ్ఞాపన చేశారు. క్షమాభిక్ష వేడాడు. ఈ రోజున నా భారతజాతి పాపాలను నీవూ నేనూ ఒప్పుకోవాలి. లేకపోతే దేవుడు జాతిని స్వస్థపరచడు. నిత్యదేవుని సన్నిధిలో మనదేశం కోసం మనం ఏడవాలి. నిత్యత్వము నుండి నిత్యత్వము వరకూ ఆయనే మన దేవుడు. మనతో ఉన్నాడు.

క్రీస్తునందు భవదీయుడు - ఆరార్కే

# మనలో మాట....

ప్రభువునందు ప్రియ పాఠకులకు,

**'మీ హృదయములను కలవర పడనియ్యకుడి, నేనుండు స్థలములో మీరనూఉండేట్టు మీ కోసం స్థలం సిద్ధపరచటానికి వెళుతున్నాను'** (యోహాను 14.1) అని చెప్పిన యేసయ్య శుభనామమున మీ అందరికీ వందనాలు.

దైవజనులు ఆచార్య ఆరార్కే మూర్తి గారి మరణ వార్తకు అసంఖ్యాలుగా ఫోన్లు వచ్చాయి. జులై 15, 16, 17 తేదీల్లో మేమంతా హైదరాబాదులోనే ఉన్నాము గనుక ఆఫీసు ఫోన్ పనిచేయలేదు. ఎన్నో మిస్డ్ కాల్స్ ఫోన్లలో ఉన్నాయి. అనేక మంది కన్నీరు, మున్నీరుగా విలపించారు. దైవజనుడు అప్పుడే మరణించాడా? అంటూ చాలా మంది దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కాలములు, సమయములు దేవుని చేతిలో ఉన్నాయి. భక్తుడు దావీదు అంటాడు, నా కాలగతులు నీ చేతిలో ఉన్నాయి. దైవజనులు ఆచార్య ఆరార్కే గారు 'ఇక్కడ' లేరు కాని 'అక్కడ' ఉన్నారు.

శ్రీమతి మూర్తి గారి జ్ఞాపకార్థ సభ రోజున ఆరార్కే మాటలు మీకు జ్ఞాపకం చేస్తాను. **'అంత్య దినమందు దూత బూరనూదుచుండగా.. లేదా నా జీవితం కూడా ముగిసినపుడు, మేము కూడా చేరియుందుము అచ్చట. యస్ లార్డ్ వుఆర్ ప్రజెంట్ హియర్ (అవును ప్రభువా మేముకూడా నీ సన్నిధికి వచ్చాము) అంటాము.** నాయన గారి మరణ వార్త వినగానే నాకీ మాటలే గుర్తొచ్చాయి.

మూడు జన్మలు –

**1. తల్లి గర్భమున జన్మ**

ఓ చిన్న బిందువుగా వున్న పిండము తల్లి గర్భంలో దాదాపు తొమ్మిది నెలలో రూపురేఖలను సంతరించుకునే ఈ కాలంలో తన చుట్టూ ఉన్న కండరాలతో ఓ బంధం ఏర్పడుతుంది. తల్లి గర్భంలో ఎంతో సుఖంగా పెరుగుతోన్న శిశువు నెలలు నిండి బయటికి రావాల్సిన పరిస్థితి వచ్చినపుడు, రావటానికి ఇష్టం ఉండదట, అందుకే ఆ తల్లి అంత వేదనతో బిడ్డకు జన్మనిస్తుంది. ఇంత కాలం తమతో కలిసి ఉన్న కండరాలకు కూడా అది ఎంతో బాధ, అయితే ఒక్క విషయం గమనించాలి. నెలలు నిండినపుడు బిడ్డ బయటికి రావటం తల్లికి, బిడ్డకు ఎంతో క్షేమం. కుటుంబానికి ఓ కొత్త సభ్యుడు వచ్చాడని ఎంతో సంతోషం! సరిగ్గా మనం పరలోకంలో జన్మించినపుడు ఇదే జరుగుతుంది.

**2. ఆధ్యాత్మిక జన్మ**

ఒక వ్యక్తి మారుమనస్సు అనుభవం తరువాత తన పాత అలవాట్లు, స్నేహితులన నుండి విడుపించుకుని నూతన జన్మ అనుభవంలోనికి రావటం కూడా అలాంటిదే!

**3. పరలోకంలో జన్మ**

విశ్వాసి ఇక్కడ శాశ్వతంగా కన్ను మూశాడు అంటే శాశ్వత రాజ్యంలో కళ్లు తెరిచాడు అని అర్థం. ఈ లోకంలో ఒక కుమారుడు పుడితే ఎంత సంతోషమో, పరలోకానికి ఒక భక్తుడు వెళ్లినపుడు అంత సంతోషం ఉంటుంది.

ప్రతి రోజు మనం నిద్రపోతాము. అలాగే ఏదో ఒక రోజున ఈ లోకంలో శాశ్వతంగా నిద్రపోతాము. ప్రతి రోజు మనం లేస్తాము, ఏదో ఒక రోజున ప్రభువు సన్నిధిలో తిరిగి లేస్తాము.

**స్మశానవాటిక – సమాధుల తోట**

విశ్వాసులకు శుభప్రదమైన నిరీక్షణ ఉన్నది. లోకస్థులు 'స్మశానవాటిక' అంటారు. కాని క్రైస్తవులు 'సమాధుల తోట' అంటారు. అంటే పార్థివ దేహాన్ని ఓ విత్తనంలా సమాధుల తోటలో మనం విత్తుతున్నాము. ఒకానొక రోజు ప్రభువు రాకడలో వారు తిరిగి లేస్తారు.

దేవుని బిడ్డలను తనలో ఇముడ్చుకునే శక్తి లేదా జీర్ణించుకునే శక్తి దేవుడు భూమికి ఇవ్వ లేదు, ప్రభువు రాకడ పర్యంతమూ తనలో భద్రంగా దాని ప్రభువు రాకడ సమయంలో ప్రభువు బిడ్డలను ప్రభువుకు అప్పగించాల్సిన బాధ్యత ఈ భూమిది.

దేవుని వాక్యంలోని చక్కని మాట – **నీతిమంతుని జ్ఞాపకం చేసుకోవటం ఆశీర్వాదం** సామె.10.7. దైవజనులు ఆచార్య ఆరార్కే మూర్తి ఓ నిష్ఠగల బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి దాదాపుగా ముప్ఫై సంవత్సరాల ప్రాయంలో ప్రభువును వ్యకిగత రక్షకుడిగా అంగీకరించి నీతిమంతులుగా తీర్చబడ్డారు. దేవునికి స్తోత్రాలు. అందుకే వారిని జ్ఞాపకం చేసుకోవటం మన జీవితాలకు

ఎంతో ఆశీర్వాదం. అందుకు వచ్చే నెల 'సెప్టెంబరు' సంచిక ఆరార్కే గారికి ఆత్మీయ నివాళి అర్పిస్తూ ప్రత్యేక సంచిక ప్రచురిస్తున్నాము.

వాక్యం దేవుని బిడ్డల మరణాన్ని గురించి ఏమి సెలవిస్తున్నదో మనం క్లుప్తంగా ధ్యానిద్దాము.

**1) విశ్వాసి మరణం - 'మేలు'**

ప్రసం. 7.1 **ఒకని జన్మదినముకంటే మరణదినమే మేలు.**

- విశ్వాసులు లోకస్తుల వల్లే గుండెలు పగిలేలా ఏడ్చి, దు:ఖించే సమయం కాదు. ఆరార్కే గారితో నేను గడిపిన ప్రశస్త ఘడియలు గుర్తొచినపుడు ఆనంద బాష్పాలు తెలియకుండానే రాలుతున్నాయి. రక్తమాంసాలు, శరీరంలో ఉన్నాము కనుక సహజం. ఆరార్కే నాయన గారు దేవుని మహాకృపలో 85 సం॥రాలు జీవించారు అది దేవుని కృప. వారి జీవితమే ఓ చక్కని ప్రసంగం. ఎలా తెలుసు? వారి సేవ ద్వారా ప్రభావితమయినవారిని చూచినపుడు మనం తెలుసుకోగలము.

**2) విశ్వాసి మరణం - 'విలువ'**

**యెహోవా భక్తుల మరణము ఆయన దృష్టికి విలువ గలది.** కీర్తన 116.15

**దేవుని దృష్టికి విలువ. ఇహలోకంలో ఉన్న కష్టాలు బాధలు చింత దుంఖము లేని దేవుని రాజ్యానికి వెళ్లడం. దేవుడనుకుంటాడు తన కుమారులలో ఒకడు ఇంటికి వచ్చాడు.**

- యెషయా 57. 1, 2 - **భక్తులు తీసికొనిపోబడతారు. కీడు చూడకుండా నీతిమంతులైన వారు కొనిపోబడుచున్నారు. వారు విశ్రాంతిలో ప్రవేశిస్తారు.**

**- ఒక విశ్వాసి మరణమనే ద్వారం గుండా మహిమ రాజ్యంలోనికి అడుగు పెడుతున్నాడు. పాపక్షమాపణ నొందిర వారు మహిమలోనికి లేని వారు మరణానికి అప్పగించబడతారు.**

**3) విశ్వాసి మరణం - 'లాభము'**

ఫిలిప్పి 1. 21 **బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభము.**

పౌలు భక్తుని దృష్టి గమనించాలి. మరణమనే ద్వారం గుండా వెళ్లి క్రీస్తును సంపాదించుకోవటం లాభంగా చూస్తున్నాడు. అందుకనే తిమోతికి రాస్తున్నాడు. 2 తిమోతి 4. 6-8 **మంచి పోరాటము పోరాడితిని. విశ్వాసమును కాపాడుకొంటిని. ఇక మీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది.**

కనక విశ్వాసి మరణమంటే అది లాభామని గుర్తించాలి.

**4) విశ్వాసి మరణం - 'ధన్యత'**

ప్రకటన 14.13 **అంతట - ఇప్పటినుండి ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు అని వ్రాయుమని పరలోకమునుండి ఒక స్వరము చెప్పగా వింటిని. నిజమే వారు తమ ప్రయాసము మాని విశ్రాంతి పొందుదురు, వారి క్రియలు వారి వెంట పోవునని ఆత్మ చెప్పుచున్నాడు.**

**'పరలోకము నా దేశము, పరదేశి నేనిలా మాయలోకమేగా నేను యాత్రికుడను' అనే చక్కని పాట మీరెప్పుడైనా విన్నారా? ఆత్మసంబంధమైన పాట!**

**ప్రభువన్నాడు యోహాను 14. 1-3. నేనుండు స్థలములో మీరును ఉండులాగును నేను మరలా వచ్చి మిమ్మును తీసుకొని పోదును. మన కోసం 'స్థలం' అంటే 'భవనాలు' (ఇంగ్లీషు బైబిలు ప్రకారం) ప్రభువు సిద్ధం చేస్తున్నాడు.**

**5) విశ్వాసి మరణం - 'ప్రభునొద్ద నివసించటం'**

2 కొరింథీ 5. 8 ప్రభువునొద్ద నివసించుటకు **ఇష్టపడుచున్నాము.** అదే అ. లో **మరణము మనందరికీ ప్రాప్తిస్తుంది.** (1-7) అని చదువుతాము.

**ఈ లోకంలో ఉండగా దేవుని కోసం జీవించటం కోసం మరణాంతర మహిమలో జీవితం మనకెంతో ఇష్టం. దేవుని బిడ్డలకు మరణం మహిమకు, కిరీటానికి నడిపిస్తుంది.**

ప్రభువునందు ప్రియ పాఠకులారా ఈ మాటల చేత ఆదరణ పొందుదాం! ఆ శుభప్రదమైన నిరీక్షణ మనం కూడా కలిగియుందాము.

దైవజనులు ఆరార్కే గారు తెలుగు క్రైస్తవ చరిత్రలో ఓ చెరగని ముద్ర వేశారనేది నిర్వివాదాశం, వారి కీర్తి అజరామరము ✶

ప్రభువు సేవలో మీ సోదరుడు

**- దేవసహాయం దండల**



**ఆచార్య ఆరార్కే**

# మనో నేత్రాలు

ఇది కృపాయుగం. సంఘయుగం. పరిశుద్ధాత్మ యుగం. ఇందులో విశ్వాసులందరూ రాజులైన యాజక సమూహం! అందరూ అదృశ్య వీరులు. నాయకులు. పరిశుద్ధాత్మ ప్రతి విశ్వాసిలో యేసు చైతన్యాన్ని వృద్ధి చేస్తాడు. ప్రకటన 1.6. మనలను ప్రేమిస్తూ తన రక్తము వలన మన పాపముల నుండి మనల్ని విడిపించిన వానికి మహిమ, ప్రభావము. ఆయన మనల్ని తన తండ్రి అయిన దేవునికి ఒక రాజ్యముగా, యాజకులుగా చేశాడు. రేపు మనం యేసుతో కలిసి ఈ లోకమంతటిని పరిపాలిస్తాము. మనకు మహోజ్వలమైన భవిష్యత్తు ఉంది.

## మహోన్నత నామం

ప్రకటన 5.10 దృశ్యం చూడండి. యేసు సిలువ వేయబడి, తన రక్తమిచ్చి ప్రతి వంశములో ఆయా భాషలు మాట్లాడే వారిలో ప్రతి ప్రజలో ప్రతి జనములో దేవుని కోసమై మనుష్యులను కొని వారిని దేవునికి రాజ్యముగా, యాజకులుగా చేశాడు. వారు భూలోకమందు ఏలుతారు. కొత్తపాట పాడతారు. జాతుల మీద కూడా వారికి అధికారమిస్తాడు. ఆధిపత్యమూ, అధికారము, శక్తి, ప్రభుత్వమూ అంతా ఆయనదే! ఈ యుగంలోనే కాదు రాబోయే యుగంలో కూడా మహోన్నత నామము పొందిన వాడు యేసు మహారాజు.

పరలోకానికి ఆయన ఆరోహణమై, ఎంతో మహోన్నత మహిమోన్నత పదవిని అలకరించి ఉన్నాడు. తండ్రి కుడిపార్శ్వమున కూర్చోని ఉన్న ప్రభువును చూస్తున్నాము. యేసుతో పాటు మనల్ని మృతి నుండి లేపి దేవుడు మనల్ని క్రీస్తుతో పాటు తనతో సింహాసనం మీద కూర్చోబెట్టుకున్నాడు. మన ఆరోహణం ఎంతో ఆశ్చర్యం! మనోనేత్రాలు తెరిచి ఇప్పుడే చూడగలగాలి. విశ్వాసి నిత్య భవిష్యత్తు ఎంత గొప్పది! ఆశ్చర్యం! ఆయన నిన్ను నన్ను పిలచాడు.ఎంత ఉన్నతమైన పిలుపు! మనకు ప్రాప్తించిన మహిమైశ్వర్య స్వాస్థ్యం ఎంతో గొప్పది.!

## పూర్తి విదేయత

విశ్వాసాన్ని బట్టి దేవుని పిలుపునకు అబ్రహాము లోబడ్డాడు. ఎక్కడికి వెళ్ళాలో తనకు తెలీదు. అయినా బయలుదేరి వెళ్ళిపొయ్యాడు. దేవుని సంపూర్ణ చిత్తంలో ప్రవేశించాలంటే దేవునికి పూర్తి విధేయత, లొంగుబాటు అవసరం. యేసు మనలో ఆనందించ కోరుతున్నాడు. ఆయనకు అనుకూల వాతావరణం మనలో ఉండేట్లు చూచుకోవాలి.



మరియ మార్తల సోదరుడు నిజంగా అక్షరాలా సజీవ సాక్షి అయ్యాడు. చచ్చిన వాణ్ని నన్ను బతికించిన యేసు ఇదుగో రండి! అది లాజరు సాక్ష్యం. విశ్వాసులందరూ లాజరు లాగా చచ్చి బతికిన వాళ్లే. ప్రతి విశ్వాసీ తన స్వంత గ్రామంలో, పట్టణంలో నమ్మకమైన సాక్షిగా బతకాలి. సమరయ స్త్రీ రక్షించబడగానే తన గ్రామంలో సాక్ష్యం చెప్పింది. అందరినీ ప్రభువు వద్దకు నడిపించింది. రండి, నన్ను రక్షించిన ప్రభువుకు మిమ్ములను పరిచయం చేస్తాను అన్నది. ఇది మొదట దేవుని కుటుంబం. తరువాతే నా కుటుంబం. వీరు మొదట దేవుని పిల్లలు. తరువాతే నా పిల్లలు అనుకుని ప్రవర్తించాలి. అలాగైతే కుటుంబ సమస్యలెన్నో అప్పటికప్పుడే పరిష్కారమవుతాయి. దేవుని హస్తాలు మనల్ని నడిపిస్తాయి, ఆశీర్వదిస్తాయి. స్వస్థపరుస్తాయి.

### దేవుని చిత్తం

దేవుడంటే భయభక్తు లుండాలనీ దేవుని చిత్తాన్ని గురించిన సరైన అవగాహన లేకపోతే విశ్వాసి ఎంతో నష్టపోతాడని దావీదు కీర్తనలలో పలుసార్లు చెప్పబడింది. 25 కీర్తనలో దావీదు గానం చేశాడు. నీ శరణుజొచ్చి ఉన్నాను. . నీ త్రోవలు కృపా సత్యమయం. నీవు ఉత్తముడవు. యధార్ధవంతుడవు. అవును. జ్ఞానమిచ్చేవాడు ఆయనే. ఆయన నోటి నుండి వెలువడే ప్రతి మాటలో తెలివి వివేచన ఉట్టిపడతాయి. సామెతలు 9.10. దేవుని యందలి భయభక్తులు జ్ఞానానికి మూలం! మనం దేవుని చిత్తాన్ని వెదకాలి(తెలుసుకోవాలి). తర్వాత ఆయనను అడగాలి. అప్పుడు 'తలుపు తట్టితే తెరచుకున్నట్లు' సత్వరమే ప్రార్ధనకు జవాబు వస్తుంది. దేవుని చిత్తాన్ని అన్వేషించి కనుగొని, ఆ ప్రకారం నడవటమే మనకు ఆశీర్వాదం.

### వేర్వేరు కాదు...

వాక్యాన్ని, పరిశుద్ధాత్మను వేరుచేయకూడదు. దేవుని సంకల్పమంతా పూర్తిగా బోధకులు బోధించాలి. ప్రజల అజ్ఞానానికి బోధకులు కారకులు కాకూడదు. క్రీస్తుతో చనిపోయి తిరిగిలేచిన వాడే క్రీస్తు సిలువను ప్రకటించగలడు. యేసుప్రభువును సందర్శించటానికి వచ్చిన జ్ఞానులెందరు? ముగ్గురి పేర్లు చెబుతాను, కాని వారు చాలామంది ఉండవచ్చు. బెల్తాసరు అరేబియా రాజు, కాస్పరు ఇండియా రాజు, మెల్కియోరు పర్షియా రాజు అని స్థూలంగా పేర్కొంటారు. జ్ఞానులు తెచ్చిన కానుకలు కూడా అనేక రకాలుగా ఉన్నాయి. బంగారం, సాంబ్రాణి, బోళము. ఈ మూడింటిని ముఖ్యంగా పేర్కొంటుంది దేవుని వాక్యం.

### బంగారం – సాంబ్రాణి – బోళం

బంగారం రాచరికాన్ని సూచిస్తుంది. సాంబ్రాణి యాజకత్వానికి సంకేతం. బోళము వైద్యులు వాడే ఔషధ క్రియ. యేసుక్రీస్తుకు వారు తెచ్చిన కానుకలు వారి సమర్పణ భావనను వెల్లడి చేస్తున్నాయి. యేసే ప్రభువు. యేసే ప్రధాన యాజకుడు. యేసే పరమవైద్యుడు. 1యోహాను 2.1. ఎవడైనా పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అనే ఉత్తరవాది అనగా మధ్యవర్తి తండ్రి యొద్ద మనకున్నాడు. హెబ్రీ 7.25 అంటోంది. యేసుక్రీస్తుతన ద్వారా దేవుని వద్దకు వచ్చేవారి పక్షమున విజ్ఞాపన చెయ్యటానికి నిరంతరము జీవిస్తున్నాడు. గనుక వారిని సంపూర్ణముగా రక్షించడానికి శక్తిమంతుడు. యేసుక్రీస్తు నిత్యత్వంలో తండ్రి ఎదుట మన పక్షాన వాదిస్తున్న న్యాయవాది, నీతిమంతుడు, శక్తిమంతుడు.

### మధ్యవర్తి

1తిమోతి 2.5. దేవుడొక్కడే దేవునికి నరులకు మధ్యవర్తి ఒక్కడే ఆయన క్రీస్తుయేసు అనే నరుడు. ఒక్కడే మధ్యవర్తి. యేసు ద్వారానే మనం దేవుని వద్దకు రాగలము. సైతాను మనకు దేవునికి విరోధి. వాడు మనకు వ్యతిరేకంగా పనిచేసే వకీలు. ప్రభువు మన పక్షాన ఉండగా మనకు విరోధి ఎవడు? ప్రభువు స్పష్టంగా చెప్పాడు. మీరు లోకానికి వెలుగు! మీ వెలుగు ఎల్లప్పుడు ప్రకాశిస్తూనే ఉండాలి. మీ దీపం దీపస్తంభం మీద అఖండ దీపమై వెలుగుతూనే ఉండాలి. మీ వెలుగు ప్రకాశమే మీ తండ్రిని మహిమ పరుస్తుంది ✶



- డా॥ దేవ దండల

# దేవుడు ఉపయోగించే మనుష్యుడు

“పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి.” రోమా 12:1-2

మనము సంపూర్ణముగా దేవుని కోసం జీవించాలని ఆయన కోరుతున్నాడు. అలాగైతే ఓ ప్రశ్న వేసుకోవాలి. మనము పూర్తిగా యేసయ్య కోసం జీవిస్తున్నామా? మనం పూర్తిగా దేవుని వారమైయున్నామా? అలాగైతే మనల్ని లోకసంబంధమైన ప్రతిదాని నుండియు, శరీర సంబంధమైన ప్రతిదానినుండియు వేరుపరచమని ఆయనను అడగాలి. అలా చేస్తేనే ఒకడు దేవుని హృదయానుసారమైన మనుష్యుడుగా నుండగలడు.

దేవుని హృదయానుసారమైన మనుష్యునిగా వుండటమంటే దేవునికి మొదటి స్థానమివ్వాలి. నిమిష నిమిషం ఆయనతో నడుస్తూ ఆయనకు అయిష్టమైనవి దేనిని చేయకుండా వుండాలి. నీతి, పరిశుద్ధత గల జీవితం జీవిస్తూ మన సంపూర్ణ గమనం ఆయనపై ఉంచి ఎక్కువగా యేసయ్యను ప్రేమిస్తూ వుండాలి. అలా చేస్తే క్రీస్తు స్వరూపం మనలో ఏర్పడుతుంది. ఆయననుండి శ్రేష్టమైన వాటిని పొందాలంటే మన శ్రేష్టమైన వాటిని మనమాయనకివ్వాలి.

దేవుడు మనల్ని వాడుకోవాలంటే మనలో ఉండాల్సిన ఆధ్యాత్మిక లక్షణాలు.

**1) ఒకే గొప్ప ఉద్దేశ్యము**

ద్విమనుస్కులెవ్వరూ సంపూర్ణముగా దేవుణ్ణి తృప్తిపరచలేరు. ఎవరైనా వ్యాపారములో లాభం సంపాదించాలని ఆశించినపుడు అతడు ఎక్కువ సమయాన్ని, తన ఆలోచన అంతటినీ దానియందే వుంచుతాడు. దేవుడు వాడుకునే మనుష్యుడు తన హృదయములో అన్నిటికంటే దేవునికే ప్రధమస్థానము నిచ్చి తన ధ్యానమంతా సేవలోనే వుంచాలి. వేరే వాటికి అతని హృదయములో చోటు వుండకూడదు. పౌలు “ఒకటి చేయుచున్నా”నని చెప్పాడు. పౌలు యొక్క జయజీవిత రహస్యం యిదే! సువార్త ప్రకటించాలని గొప్ప వేదన, భారం అతనిలో వుండేది. దివారాత్రులు సేవలో గడిపేవాడు. పౌలు తిమోతికి రాస్తూ “వీటిని మనస్కరింపుము



వీటియందే సాధకము చేసికొనుము" అని అజ్ఞాపించాడు.

నేటిదినాల్లో చాలామంది లోక సంబంధమైన వాటియందు శ్రద్ధ చూపటం వల్ల దేవుడు వారిని వాడుకోవడం లేదు. కాలేజీలో చదివే విద్యార్ధిని, విద్యార్ధులు చదువుపై మనస్సు పెట్టకుండా లోక సంబంధమైన, చెడు స్నేహాలయందు మనస్సు వుంచడం వలన వారి జీవితాలు సరిగా వుండటం లేదు. యౌవనస్థులు తమ విలువైన సమయాన్ని ఎడతెగక లోకస్తుల సహవాసములో గడిపితే దేవుడు అలాంటి వారిని ఎన్నడూ గొప్పగా వాడుకోడు. కొంతమంది సేవచేస్తూ, వేరే పనులు చేస్తుంటారు. దేవునికి ఆయన సేవకే మనము ప్రథమ స్థానమివ్వాలి. అదే నీ జీవిత ముఖ్య ఉద్దేశ్యంగా వుండాలి.

**2) జీవితంలో ప్రతి ఆటంకాన్ని దైవకృపతో తొలగించుకోవాలి**

దేవుడు నిన్ను తన పనిలో వాడుకోకుండా ఏ విషయం నిన్ను ఆటంకపరుస్తుందో మీరు నాతో చెప్పనవసరం లేదు. అది దేవునికి నీకే తెలుసు. అలాంటి సమయంలో నీవాయనతో చక్కబరుచుకోవాలి. అది భారమైన, పాపమైనా, అపవిత్రపు తలంపైనా, అపవిత్రపు క్రియలైనా, లేక గర్వము, అసూయ, ద్వేషము, ధనాపేక్ష, అవిశ్వాసము, ఏదైనా సరే దానిని నీవు తీసివేయాలి. ఇశ్రాయేలీయులు అపజయం పొందడానికి ఆకాను కారణమని మనం జ్ఞాపకం చేసుకోవాలి. నీ హృదయంలో ఆకాను వున్నాడా? నీ హృదయంలో దేవుడు తప్ప ఇతరులెవ్వరూ చూడలేని పాపమేదైనా వున్నదా? నీవు బయటికెలా కనిపిస్తావో లోపలకూడా అలాంటి వాడవేనని మనుష్యులు అనుకుంటారు. "రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురచకాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును, మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను" (యెషయా 59:1-2)

**3) తనను తాను పూర్తిగా దేవుని స్వాధీనం చేసుకోవాలి**

మనలో చాలామంది దేవునికి భయపడినట్టుగా ఆయనకే సర్వాధికారము యిచ్చినట్లు భయపడి నడుచుకుంటారు. "ఎవడైనను ఆయన చిత్తమును నెరవేర్చగోరిన యెడల" అని దేవుడు చెబుతున్నాడు. మట్టి లోబడకపోతే కుమ్మరి మాత్రం ఏం చేయగలడు? కీర్తన 101:6 ఇలా సెలవిస్తుంది "అవిధేయులైన రాణువవారి వలన ఏమి ప్రయోజనము? నిర్దోషమార్గమందు నడుచువారు నాకు పరిచారకులగుదురు."

మనం సంపూర్ణముగా దేవునికి లోబడాలి. ప్రతి నిత్యము దేవునికి "అవునని", స్వార్ధానికి "లేదు" అని చెప్పగలగాలి. మనల్ని మనం దేవునికి ప్రతిష్ఠించుకొని, ఆయన చిత్తానికి లోబడి అంగీకరిస్తే ఎక్కలేనంత ఎత్తైన స్థలాల్లోకి దేవుడు చేయిపట్టుకొని నడిపిస్తాడు.

**4) ప్రార్థనలో జయం పొందడం నేర్చుకోవాలి**

"నీవు నన్ను ఆశీర్వదిస్తేనే గాని నిన్ను పోనివ్వను" అని యాకోబు ప్రార్థించాడు. "నీవు దేవునితోను, మనుష్యులతోను పోరాడి గెలిచితివి" అని దేవుడు చెప్పాడు. దేవుడు నిన్ను గొప్పగా వాడుకోవాలంటే ఎక్కువ సమయం ప్రార్ధనలో గడపాలి. యేసయ్య తన సేవా జీవితములో ఎంత పనివున్నా, జనసమూహములను విడిచి ఏకాంతముగా ప్రార్థించడానికి వెళ్ళేవారు. కొన్నిసార్లయితే రాత్రంతా ప్రార్ధనలో తండ్రితో గడిపేవారు. ఆయన ఎంతో వేదనతో ప్రార్థించడం వలన చెమట రక్తముగా మారేది. దేవుడు వాడుకునే ప్రతి మనుష్యుని అనుభవము ఇలాగే వుండాలి. ప్రార్థించడానికి రహస్యస్థలమును ఎంచుకోవాలి.

**5) వాక్యము నేర్చుకోడానికి పట్టుదలతో బైబిలు గ్రంథమును చదవాలి**

దేవుని వాక్యము సేవకుని యొక్క ఆయుధము. దాని బలమును గూర్చి మనం సందేహిస్తే దానిని వినియోగించడంలో శక్తి ఉండదు. దైవవాక్యం అనుదిన భోజనము, పానము వలె శ్రద్ధగా ధ్యానిస్తే ఆ వాక్యము నీలో ఒక భాగమై ఆయన చిత్తానుసారముగా వాడబడతావు. నీవు ప్రకటించే వాక్యము జీవముగలదై, దైవప్రేరితమని నీవు నమ్మాలి. అది ప్రకటించినప్పుడు వట్టిగా తిరిగి రాదని నమ్మాలి. వాక్యమును సందేహించే మనుష్యుని దేవుడు ఉపయోగించుకొనడు.

(తరువాయి 28వ పేజిలో)



**బ్రదర్.ఏసన్న**

# హృదయశుద్ధి

**మీరు దేవుని ఆలయమైయున్నారని, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా? 1కొరింథీ 3:16**

దేవుని ఆలయమైయున్న మీ హృదయం శుద్ధిచేయబడితే ఆత్మీయ ఆనందం మీరు అనుభవించగలరు. మీ హృదయం ఎలా శుద్ధిచేయబడుతుంది? మీరు పాపముల విషయమై పశ్చాత్తాపపడి, యేసురక్తములో కడుగబడాలి. అప్పుడు మీ ప్రవర్తన సంపూర్ణముగా మారుతుంది. ఒకప్పుడు మీ హృదయం సకల దుర్గుణాలతో నిండి ఉండవచ్చు. ఎప్పుడైతే మీరు యేసుప్రభువును నమ్ముకున్నారో, అప్పుడు మీ పాపములు క్షమించబడి, శుద్ధీకరించబడినవారై రక్షణానందం అనుభవిస్తారు.

కొందరి ముఖాలు ఎప్పుడు చూచినా ఉసూరుమంటూ ఉంటాయి. కారణం వారి హృదయంలో పాపం. వారు చెప్పే అబద్ధాలు, చేసే అక్రమాలే కలవరానికి కారణమౌతాయి. సహించలేని గుణం నీ హృదయాన్ని దొంగల గుహగా మారుస్తుంది. వేరొకరు ఇల్లు కట్టుకున్నా వాళ్ళ పిల్లలు బాగా చదువుకున్నా సహించలేరు. పైగా మాకు తెలుసులే! వాళ్ళు ఇల్లు ఎలా కట్టారో, వాళ్ళ పిల్లలు ఎలా పాసయ్యారో! అని వ్యంగ్యంగా మాట్లాడుతుంటారు. అట్టి హృదయం శుద్ధిచేయబడకపోతే ఆనందం వారికి కనుచూపు మేరలో ఉండదు. మరి నీ హృదయం ఎలా ఉంది?

ఒకతన్ని ప్రార్థనా మందిరానికి రమ్మని నేను పలుమార్లు ఆహ్వానించాను. ఎప్పుడడిగినా నాకు వీల్లేదు, నాకు వీల్లేదు అని చెప్తుండేవాడు. అతనికి ఏ వీలు (WHEEL) లేదో ఫ్రెంటు వీలో, బ్యాక్ వీలో నా కర్థం కాలేదు. దేవుని మందిరానికి రమ్మంటే వీలులేదు అని చెప్పిన అతనికి ఆనందం ఎలా ఉంటుంది? తీరని రోగము సంప్రాప్తమై, అతని జీవితం వేదనతోనే ముగిసింది. గమనించండి! దేవుని మందిరానికి వెళ్ళి ఆయన వాక్యాన్ని వింటూ ఉంటే, నీ జీవితం పరిపూర్ణముగా మార్చబడి, ఆయనిచ్చే అవధులు లేని ఆనందాన్ని అనుభవించగల్గుతావు. ప్రపంచములో ఎవ్వరూ ఇవ్వలేని సంతోషము, సమాధానము యేసయ్య నీకిస్తాడనేది వాస్తవము అది నీ స్వంతం కావాలంటే మొదట నీవు శుద్ధీకరించబడాలి, ఆ తరువాత ఆయన మందిరములో ప్రవేశించి, ఆయనను ఆరాధించాలి, ఒకవ్యక్తి సంతోషానందాలతో జీవితాన్ని గడుపక పోతే **అతని గతికంటె పడిపోయిన పిండముయొక్క గతి మేలని ప్రసంగియైన సొలొమోను చెప్తున్నాడు.**

ఈ రోజుల్లో చర్చీలను వ్యాపారపుటిల్లుగానూ, పెండ్లి జరుగుచోట చదివింపుల పందిరిగాను భావిస్తున్నారు. ఫ్యానిచ్చినా, ట్యూబ్‌లైట్లు ఇచ్చినా, నాలుగు నాపరాళ్ళు వేయించినా పేర్లు వ్రాయకుండా పొరపాటున కూడా ఇవ్వరు. ఆ మధ్య ఒక మందిరానికి వాక్యం చెప్పటానికి వెళ్ళాను. నేను వాక్యం చెప్తూ ఉండగా, ఒకతను పెద్ద కుండ తీసుకొని దానిమీద ఆయన పేరు వ్రాయించుకొని చర్చీకి కానుక అని తెచ్చాడు. కుండేమో పదిరూపాయలు, పేరు వ్రాయించినందుకు 20



రూపాయలు ఖర్చు అదేరోజు ఒక పాప నీళ్ళుత్రాగుతూ గ్లాసు ఆ కుండలో వేసింది. అంతే ఆ కుండకాస్తా పగిలి పోయింది. ఆయన పేరు కూడా ముక్కలు ముక్కలైపోయింది. రహస్యమందున్న దేవుడు చూచేటట్లుగా అర్పించవలసిన కానుకలను బహిరంగంగా ప్రజల మెప్పు కోసం ప్రకటిస్తే, మీ జీవితాలకు కూడా ఆ కుండకు పట్టిన గతే పడుతుంది. మీరు శుద్ధీకరించబడాలి, అప్పుడు మీరు దేవుని మందిరములోని పరిపూర్ణమైన ఆనందాన్ని అనుభవించగలరు.

**ఆత్మీయ ఆనందము కొరకు ప్రాణాత్మ దేహాలకు విమోచన**

యేసు దేవాలయములో ప్రవేశించినప్పుడు గ్రుడ్డివారు, కుంటివారు దేవాలయములో ఆయన యొద్దకు రాగా ఆయన వారిని స్వస్థపరచెను (మత్తయి 21:14). చూపు తక్కువగా ఉన్నవాడికి ఆపరేషన్ చేసి చూపు సరిచేయడం, కళ్ళద్దాలు పెట్టడం సహజం. కానీ పుట్టు గుడ్డివానికి కళ్ళివ్వడం ఏ డాక్టరుకైనా సాధ్యమేనా? రోగముతో ఉన్న ఒకవ్యక్తి డాక్టరు దగ్గరకు వెళ్తే, అతడు ఆ రోగాన్ని బాగుచేయగలడేమోగాని, నీకున్న ఇతర సమస్యలను తొలిగించలేడు కదా. అయితే నీవు దేవుని మందిరానికి వస్తే, యేసయ్య నిన్ను బాగుచేస్తాడు.

**(కీర్తన 49:15; ఎఫెసీ 1:14).** దేవుడు మనకు ఇచ్చేది శరీరసంబంధమైన స్వస్థత మాత్రమే కాదు, తన ఆత్మచే మనలను ముద్రిస్తాడు. మన ప్రాణాత్మ శరీరములకు విమోచన కలుగుజేస్తాడు. శుద్ధీకరించబడిన మనము మందిరములో ప్రవేశించి, ఆయన వాక్యాన్ని శ్రద్ధగా వింటూ, ఆయనను ఆరాధిస్తూ ఉండగా; మనలను పరిశుద్ధాత్మతో అభిషేకిస్తాడు, అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించునట్లుగా చేస్తాడు. కొందరు పరిశుద్ధాత్మలో ఆనందించేవారిని విచిత్రంగా చూస్తుంటారు. మరికొందరు హేళన చేస్తారు. తాముకూడా ఈ అనుభవాన్ని పొందాలనే ఆలోచన వారికి లేకపోడం శోచనీయం. ఈ లోకపు డాక్టర్లు నీ రోగానికి మందిస్తారు గాని ఆత్మకు పట్టిన రోగానికి మందు నీకెక్కడా దొరకదు. నీ ప్రాణము, శరీరము, ఆత్మలకు పట్టిన ఏ రోగమునుండైన నీవు స్వస్థత పొందాలనుకుంటే ఆయన మందిరములోనికి నీవు రావాలి. అప్పుడు ఆయన ద్వారా సంపూర్ణ స్వస్థత పొందుతావు.

**ఆనందంతో కూడిన ఆరాధన**

ఎప్పుడైతే యేసయ్య ద్వారా అద్భుతాలు మహత్కార్యాలు జరిగాయో అక్కడున్న శాస్త్రులు, పరిసయ్యులు, ప్రధాన యాజకులు, ధర్మశాస్త్రోప దేశకులందరు కలవరపడ్డారు. అందరూ **హోసన్నా హోసన్నా అంటూ ఉంటే వీరి గుండెలు బ్రద్దలయ్యాయి.** ఆనందముతో కేకలు వేస్తున్న ప్రజలను ఆపాలని వీరు ఎంతో ప్రయత్నించారు గాని వీలుకాలేదు. ఆనందంతో ఆరాధిస్తున్న వారి కేకలు మరీ ఎక్కువయ్యాయి. తాము చూచిన అద్భుతములన్నిటిని గూర్చి మహా శబ్దముతో దేవునికి స్తోత్రము చేస్తున్న ప్రజలను చూచి, పరిసయ్యులు యాజకులు మండిపడ్డారు. కొందరు పరిసయ్యులు **– బోధకుడా, నీ శిష్యులను గద్దింపుమని ఆయనతో చెప్పారు (లూకా 19:39).** ఎవ్వరు చెప్పినా, ఎందరు ఆపినా వారి ఆనందంతో కూడిన ఆరాధనకు అడ్డుకట్ట వేయలేకపోయారు. అప్పుడు యేసయ్య శాస్త్రులతో, ప్రధాన యాజకులతో **– వీరు ఊరకుండిన యెడల ఈ రాళ్ళు కేకలు వేయునని మీతో చెప్పుచున్నాననెను ... (లూకా 19:40).**

గమనించండి! శుద్ధీకరించబడి, మందిరములో ప్రవేశించి, ప్రాణాత్మ దేహాలలో స్వస్థత పొందిన ప్రజలు స్తుతి ఆరాధన ఆరంభించారు. పాపములేని హృదయమునుండి వచ్చిన ఆ ఆరాధన ఆపడం ఎవరితరం కాలేదు. అలాగే ఈ సందేశాన్ని చదువుచున్న నీవు దేవుని వాక్యము ద్వారా శుద్ధిచేయబడితే; నీ ప్రాణాత్మ దేహాలకు విమోచన కలుగుతుంది. వెనువెంటనే ఆనందంతో కూడిన ఆరాధన నీ గుండెల్లో ప్రారంభమవుతుంది. ఈ అనుభవం నీవు పొందాలంటే ఆత్మతో ఆరాధించే దేవునిబిడ్డల మధ్యలో నీవు ఉండాలి. మరి ఇప్పటికే ఆయనద్వారా ఎన్నో మేళ్ళు అనుభవించిన మీ ఆరాధన ఎలా ఉంది? మీరు సజీవుడైన యేసయ్యను ఆనందంతో ఆరాధిస్తున్నారా? సజీవులైన మీరు స్తుతించుట ఆపితే నిర్జీవమైన రాళ్ళు కేకలు వేస్తాయని యేసయ్య సెలవిచ్చాడు కదా! మరి మీరు నిర్జీవమైన వాటికంటే ఘోరమైన దుస్థితిలో ఉన్నారేమో? ఒక్కసారి ఆలోచించండి.

దేవుని మందిరానికి ఆయన నిన్ను తోడుకొని వచ్చి ఆనందింపజేస్తానని వాగ్దానము చేసాడు. ఆ ఆనందాన్ని నీవు అనుభవించాలంటే మొదట నీవు శుద్ధీకరించబడి, దేవుని మందిరములో ప్రవేశించి, ప్రాణాత్మ శరీరములలో స్వస్థత అనుభవిస్తూ, స్తుతి ఆరాధనలతో ప్రభువును ఘనపరిస్తే అప్పుడు ఆయన వాగ్దానము నీ జీవితంలో నెరవేర్చబడుతుంది.

**దేవుని మందిరములోని ఆ ఆనందాన్ని, నిత్యత్వపు ఆశీర్వాదాలను ప్రభువు నీకు అనుగ్రహించును గాక! ఆమేన్!!** ★



ఆర్.ఎలూజై

# మానవ నైజం

యక్షప్రశ్నలనేవి ఎలాగుంటాయో తెలీదుగానీ, చిన్నతనంలో పిల్లలు పెద్దవాళ్ళకు సంధించే చిక్కుప్రశ్నల్లాగానూ, తిరిగి వాళ్ళు యవ్వనంలోనికి అడుగు పెట్టాక పెద్దలు వారిపై గుప్పించే సందేహ విమర్శన అస్త్రాల్లాగానూ ఉంటే ఉండవచ్చని కొందరు అభిప్రాయపడుతుంటారు. ఆ ప్రశ్నలన్నింటికీ జవాబులు గనుక సరిగ్గా చెప్పగలిగితే 'టెస్ట్ ఆఫ్ రీజనింగ్' ఈజీగా పాసయిపోవచ్చనేది యువతరపు ప్రజ్ఞావంతుల ప్రగాఢ నమ్మకం. అసలు మమ్మల్ని అర్థం చేసుకునే వారు ఎవరైనా ఎక్కడైనా ఉంటారా అని యువత ఎప్పుడూ ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉంటుంది. ఎందుకంటే వారి విషయంలో పిన్నలదీ పెద్దలదీ ఒకటే దారి మరి. నా అనుభవంలో సగం లేదంటారు! జనరేషన్ గ్యాప్ అంటారు! అతిగా ఆలోచిస్తున్నావంటారు! ఇంకా ఎన్నో ఎన్నో అంటూనే ఉంటారు. వీరు వింటూనే ఉంటారు. ఏదో కొంచెం అర్థం చేసుకుని ఆసరాగా ఉంటే, జీవితం చైతన్యవంతంగా ఉంటుంది గానీ, మనమేంటో, మన ఆలోచనలేంటో అర్థం చేసుకునేవారే కరవైతే, జీవితం నిర్లిప్తంగా మారిపోవక మరేమవుతుంది! అనే యువతరపు ప్రశ్నకు సమాధానం చెప్పడం కొంచె కష్టమైన విషయమే, అయితే ఎవరిని అర్థం చేసుకోవాలి? ఇతరులు మనలను అర్థం చేసు(కో)కుంటే ఏమవుతుంది? అనే ఆలోచనలను అధ్యయనం చేయాలంటే మాత్రం ఒకసారి 'ఏలా' లోయకు వెళ్ళి రావాల్సిందే.

## ఏలా లోయకు వెళ్ళడం

క్రీ.పూ 10వ శతాబ్దంలో ఒకసారి ఫిలిష్తీయులు దేశంపై దండెత్తి వచ్చినప్పుడు ఇశ్రాయేలీయులు కూడివచ్చి, ఏలాలోయలో యుద్ధపంక్తులుగా బారులు తీరి నిలువబడ్డారు. బెత్లెహేమునకు చెందిన ముగ్గురు యూదా గోత్రికులు కూడా రాజు వెంబడి యుద్ధానికి వెళ్ళారు గనుక, వారి తండ్రి తన చిన్న కుమారుని పిలువనంపించి, యుద్ధభూమిలో అససిపోతున్న అన్నలకు ఆహారమిచ్చి, వారినుంచి క్షేమసమాచారాన్ని తీసుకుని రావాలని అతనిని ఏలాలోయకు పంపించాడు. తండ్రి ఆజ్ఞను శిరసావహించిన కుమారుడు అన్నలకు రొట్టెలు, అధిపతులకు జున్నుగడ్డలు తీసుకుని, అక్కడకు వెళ్ళి సహోదరులను కుశల ప్రశ్నలు అడుగుతుండే సరికి, సున్నతిలేని గాతువాడొకడు, ముందుకు వచ్చి ఇశ్రాయేలు సైన్యాన్ని తృణీకరించడం కనిపించింది. అప్పటికతడు నలుబది దినములనుండి ఉదయము, సాయంత్రము తనను తాను ఇశ్రాయేలీయులకు అగపరచుకొనుచు వారిని తూలనాడుతూనే ఉన్నాడు. (1 సమూ 17:16) ఇశ్రాయేలీయులు జయము జయమని యుద్ధానికి సాగుతూ ఉన్నా, (17:21) ఏడుమూరల జానెడు (ఇంచుమించు 91/2 అడుగులు)



ఎత్తున్న ఆ మనుష్యుని చూడగానే మిక్కిలి భయపడి వాని ఎదుటనుంచి పారిపోయారు.

## రాజు ముందుకు రావడం

ఇలా సున్నతి లేని ఫిలిష్తీయుడొకడు, తన వారినందరినీ తిరస్కరిస్తుంటే. ఆ యువకునికి కోపం రగిలిపోయింది. "జీవముగల దేవుని సైన్యములను తిరస్కరించుటకు ఈ సున్నతి లేని ఫిలిష్తీయుడెంతటివాడు? వానిని చంపిన వానికి బహుమతి ఏంట'ంటూ (1 సమూ 17:26) తన యొద్ద నిలిచిన వారిని అడుగుతూ ఉంటే, అతని పెద్దన్న ఏలియాబు చాలా కోపపడ్డాడు. కానీ ఫిలిష్తీయునికి వెరువక ఈ యువకుడు పలికిన మాటలు ఆ నోటా ఈ నోటా రాజుగారి చెవిన పడనే పడ్డాయి. గాతువాడైన ఆ రాక్షస దేహునితో పోరాడేందుకు ఒక యువకుడు ముందుకు రావడంతో రాజు అత్యానందభరితుడాయ్యాడు గానీ, అతని పై రూపాన్ని లక్ష్యపెట్టి 'నీవు బాలుడవు! యుద్ధాభ్యాసము లేనివాడవు అంటూ సందేహాన్ని వ్యక్తపరచాడు. అంతట ఆ యువకుడు తాను సింహంతో ఎలుగుబంటితో పోరాడి వాటిని జయించిన తీరును వివరించి, "యెహోవా ఈ ఫిలిష్తీయుని చేతిలోనుండి నన్ను విడిపించును" అని విశ్వాసం వ్యక్తం చేయడంతో రాజుకు పోయిన ధైర్యం తిరిగి వచ్చింది.

## యుద్ధంలో జయించడం

ఎలాగైతేనేం, గాతువాడైన గొల్యాతుతో పోరాడగల యోధుడొకడు దొరికేసరికి అత్యానందభరితుడైన రాజు అతనికి శిరస్త్రాణాన్ని, కవచాన్ని ధరింపజేశాడు గానీ, భారంగా ఉన్న ఆ ఉపకరణాల్ని వదలిపెట్టి 'ఉత్త' చేతులతోనే పోరాటానికి బయలుదేరాడా యువకుడు. ఎంత ధైర్యముంటే మాత్రం ఏడుమూరల ఎత్తున్న వాడితో పోరాటానికి చిన్న కర్రక పట్టుకొని బయలుదేరతాడా! (1 సమూ 17:40) గాతువాడికి కోపమొచ్చిందంటే రాదా మరి! "నేను కుక్కనా" అంటూ ఆ యువకునిపై కోపం చూపించాడు గానీ, 'అరిచే కుక్క కరవదు' అనే సూత్రం గుర్తుకొచ్చినట్లుంది, కరిచే అవకాశం ఎలాగూ లేదని అర్థమై పోయి, అరుపుల్లోనే సరిపెట్టుకున్నాడు. వడిసెల నుండి విసరిన చిన్న రాతిదెబ్బకే నేలను కూలాడు. పడిన వాడిని పడినట్టే మట్టు బెట్టే సరికి, ఫిలిష్తీయులు బ్రతుకుజీవుడా అంటూ పరుగులంకించుకున్నారు. ఇశ్రాయేలీయులు వారిని తరిమి తరిమి నేలను కూల్చారు. తెగ్గొట్టిన గొల్యాతు తలను ఆ యువకుడు చేతబట్టుకొని వస్తే, ఊరూ వాడా అంతా



సంబరాల్జేసుకున్నారు. ఆ విధంగా ఒక యువకుడు చూపిన తెగువ, ఇశ్రాయేలీయులకు చిరస్మరణీయమైన విజయాన్నందించింది.

## ఎవరా యువకుడు

యుద్ధం ముగిసి తరువాత ఇశ్రాయేలు రాజైన సౌలు ఆ యువకుని చూచి "నీవెవని కుమారుడవు" అని ప్రశ్నిస్తే, "నేను బెత్లెహేమీయుడైన యెష్షయి అను నీ దాసుని కుమారుడను" అని ఆ యవకుడు రాజుకు ప్రత్యుత్తరమిచ్చాడు (1 సమూ 17:58) ఇశ్రాయేలీయులకు ఇంతటి విజయాన్ని సాధించి పెట్టిన ఆ యువకుడెవరో నిజంగానే సౌలుకు తెలీదా! యుద్ధం ప్రారంభకాక ముందు నుంచీ దురాత్మ యొకటి ఇశ్రాయేలు రాజైన సౌలును వెరపిస్తుంటే అతని సేవకులు దావీదు అను ఈ యువకుణ్ణి రాజు సన్నిధికి తీసుకుని వెళ్ళారు. రాజుకు బాగుండనప్పుడెల్ల అతడు సితారా వాయింపగా దురాత్మ రాజును విడిచిపోయెను గనుక అతడు సేదదీరి బాగయ్యాడు ( 1 సమూ 16:21) మరి దావీదు బహు శూరుడును, యుద్ధశాలియు, మాట నేర్పరియునైయుండి, సితారా బహు చమత్కారముగా వాయింపగలడని సౌలు సేవకులు అతనికి ముందే తెలియజేశారు. అంతేగాక అతనియందు సౌలునకు బహు ఇష్టము పుట్టెను గనుక అతడు సౌలు ఆయుధాలను మోయు వాడయ్యాడు (16:21) ఆ తరువాత అతడు బెత్లెహేములో తన తండ్రి గొర్రెలను మేపుచు సౌలు నొద్దకు తిరిగి వస్తూ పోతూ ఉంటే.. (17:15) ఇప్పుడు సౌలు అతనిని గుర్తు పట్టలేకపోయాడా! తనకు సేదదీరులాగున వీణె వాయించు

(మిగతా 29వ పేజీలో)



ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

# పవిత్ర భూమికి పరిశుద్ధ యాత్ర

మార్చి నెలలో ఒకరోజు రాత్రివేళ 10 దాటింది. నా సెల్ మోగుతుంది. తెలిసిన నంబరే కాని గుర్తు లేదు. ఎవరో ఉంటారా! అని తీసేలోగా ఆగిపోయింది. మళ్ళీ మోగింది, వెంటనే తీశాను. తెలిసిన పరిచయమున్న, సమీప స్వరం. "అయ్యా! నేను ప్రొఫెసర్ నిర్మల మేరీని! మీ మాజి ప్రిన్సిపల్ని. మీకు మనవరాల్ని" అంటూ గడగడ చెప్పేసరికి! "అమ్మా! బాగున్నారా! అని నాలుగు మంచిమాటలు.

"ఈ రాత్రివేళ ఎందుకు ఫోన్ చేశానా! అని అనుకుంటున్నారా! కంగారేమి లేదు! ఈ మధ్య నేనూ, మా సుధీర్ హోలీలాండ్ వెళ్ళివెచ్చాము. ఆ పవిత్ర యాత్రను గూర్చి వర్ణింపలేను. నిజానికి నా జన్మ ధన్యమయ్యింది. ఈ జీవితం దేవుడిచ్చినందుకు ఆయ నడిచిన నేల, మరణించి తిరిగి లేచిన ఏకైక ఖాళీ సమాధి ఒక టేమిటి అన్ని చూసి ఆనందించి పదేపదే తలచుకొంటూ మీరు తప్పక వెళ్ళాలి నాయనా!" అన్నారు.

నిజానికి ఆమె నాకన్నా వయస్సులో పెద్ద. వరసకి మనుమరాలు. విద్యలోను ఆధిక్యతలోనూ, శాస్త్ర విద్యాపరంగా ఎన్నో పురస్కారాలు, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మహిళ. ఆమె ఆప్యాయంగా, నవ్వుతూ పలకరిస్తేనే చాలు రాక్షసులైనా, రాయిలాంటి వాళ్ళయినా దేవునిముందు దాసోహమన్నట్టు సాగిలపడవలసిందే. అంతటి భక్తి విశ్వాసాలు గల మంచి మహిళ. నేను మరో ఆలోచన లేకుండా! ఎవరినీ సంప్రదించకుండా సరే అని, వివరాలు పంపమన్నా! అంతే మరి! వారం తిరిగేలోగా వివరాలు! మా ప్రయణం ఖరారు అయింది.

సాక్షి పత్రికలో ఆదివారం సువార్త కాలం రాసే రెవ.టి.ఎ.ప్రభుకిరణ్ దీనికి సారధ్యం. ఆయన ఇప్పటికి ముప్పై మూడుసార్లు అనేక బృందాలకు నాయకుడిగా నడిపించాడు. మే నెల 24వతేదీ తెల్లవారు ఝామున 4 గం.లకు ఎయిర్అరేబియా విమానంలో మాకు టిక్కెట్లు వీసా అన్ని సిద్ధమయ్యాయి. మే 23 రాత్రి 12 గం.లకు నేను, నా శ్రీమతి డా॥జ్యోతి, మా ముద్దుల గారాల పట్టి డా॥హిమబిందు హైదరాబాదు శంషాబాద్ విమానాశ్రయం చేరాం. ముందుగా బోర్డింగ్ పాస్ తీసుకుని, ఇమిగ్రేషన్ పనులు పూర్తయ్యాక గేట్ నం. 32కి వెళ్ళాం. ఈ లోగా మా టూర్ నాయకుడు అక్కడికి చేరాడు. ఆయన్ని అదే ప్రత్యక్షంగా చూడటం. పరిచయాలు అయ్యాక అందరం తెల్లవారుఝామున మూడున్నర గం.లకు సామూహిక ప్రార్ధన అనంతరం విమానంలోకి వరుసగా వెళ్ళాం. మా టీం అంతా 54మంది. ఎవరూ ఎవరికి తెలియదు. ఇంటిపేరు బట్టి నేను కొంత గుర్తించాను. ఎయిర్పోర్ట్ లాంజ్లో కొందరూ, విమానంలో కొందరూ పరిచయాలు, కరచాలనాలు, నవ్వులు, ఏదో ఆనందం మనస్సులో ఉక్కిరి బిక్కిరవుతున్న సంబరాల ఉత్కంఠ. దేవదేవుడు తిరిగిన ప్రదేశం చూడబోతున్నామనే సంతోషంతో అందరి ముఖాల్లోను ఒక వెలుగు



కనిపించింది.

చక్కగా కూర్చోని బెల్ట్ బిగించుకొని కూర్చున్న తర్వాత సరిగ్గా నాలుగు గంటలకు ఎయిర్ అరేబియా విమానం అరేబియా సముద్రం మీదుగా షార్జా చేరాం. అప్పుడు అక్కడ ఉదయం ఆరుగంటలు. మనకన్నా వాళ్ళ సమయం 2 గంటలు వెనుక. అంటే మన దేశంలో 8గం.లయ్యింది. ఆ వెంటనే 7.15 ని.లకు షార్జానుంచి అలెగ్జాండ్రియా (వాళ్ళు అలెక్సంద్రియా అంటారు. ట,ఠ,డ,ఢ,ణ లు వాళ్ళు పలుకలేరు. మూర్ధన్యాక్షరాలు వాళ్ళ భాషలో లేవు. అన్నీ దంతమూలీయాక్షరాలే) బయలుదేరాం! దారిలో మా టీం అంటే 54 మందికి వేడివేడి చికెన్ బిరియాని, వెజిటబల్ సలాడ్, జాఫ్సన్ చాక్లెట్ కేక్, బన్, జామ్, ఛీజ్ యిచ్చారు. ఉదయం అల్పాహారం స్వల్పంగా ఉంటుందని అనుకున్నా అనల్పంగానే ఉంది. అది తినేలోగా డ్రింక్ టిన్ యిచ్చారు. అది త్రాగి బ్రేవ్ అనేలాగా వేడివేడి కాఫీ వచ్చింది. అదీ తాగాక ఇంక చాల్లే అనుకునే లోగా నిద్రపట్టింది.

కలతనిద్ర. ఆకాశంలో ఆనందంతో తేలిపోతున్న అనుభూతి. "యేసయ్యా! నువ్ నాకు కన్పిస్తున్నావ్! నిన్ను చూస్తున్నా! నీ దగ్గరకే వస్తున్నా" అని తెలియకుండా! మనస్సులోనే మెదలిన మాటలు.

కాస్తంత కళ్ళు తెరచి కిటికీ నుండి బయటికి చూస్తే 55వేల అడుగుల ఎత్తులో మైనస్ 48డిగ్రీల వాతావరణంలో మా ప్రయాణం. విమానంలో మాత్రం మాకు హాయిగా ఉంది. బయట మేఘాలు గుంపులు గుంపులుగా కదులుతూ ఆనందాన్నిస్తున్నాయి. అందులో రకరకాల ఆకారాలు, మేఘంమీద యేసుస్వామి వస్తున్నట్లు, ఆయన దూత గణ స్తుతిస్తోత్రగానం చేస్తున్న అనుభూతి. ఎక్కడో! ఒక సూర్యరేఖ. అది మాకు ఉషోరేఖగా అనిపించింది.

ఆ ఊహల్లో నుంచిబయట పడేలోగా అలెక్సంద్రియా మరికాస్సేపటిలో వస్తున్నట్టు పైలట్ ప్రకటన. ఈలోగా ఆకాశ ఆతిథ్యసుందరి మళ్ళీ మమ్మల్ని బెల్ట్ సరిగ్గా కట్టుకోమని, వాలినకుర్చీ సరిచేసుకొమ్మని సూచనలిస్తూ వడివడిగా వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన పదినిమిషాల్లో విమానం అలెక్సంద్రియాలో ఆగింది.

ఆనందంగా వళ్ళు విరుచుకు లేచి కాబిన్ బాగేజి సర్దుకుని మా లగేజి తీసుకునే లోగా వీసాలు పట్టుకొని మా లోకల్ గైడ్ జిజూ రెడీగా ఉన్నాడు. పాస్‌పోర్ట్‌పై "ఈజిప్టు" వీసా అంటించి సంబంధిత వీసా ఆఫీసర్ వద్దకెళ్ళాం. ఒక్కడ ఒక్కక్షణంలో స్టాంపువేయడం సామాన్లు తీసుకుని బయట మా "గరుడవాహనం" వద్దకెళ్ళాం. మన వోల్వాబస్‌ల కన్నా పెద్దగా విశాలంగా ఉన్నాయా బస్‌లు. బాగా పెద్దవి. 54 మందీ హాయిగా కూర్చున్న తర్వాత ప్రార్థన. అనంతరం ఈజిప్ట్ నుంచి కైరో ప్రయాణం. అప్పుడు అక్కడ 10:30 గం.లు మనకి దాదాపు 2 గం.లు అక్కడినుంచి కైరోకి 222 కి.మీటర్లు.

ఈజిప్ట్‌లో రెండవ పెద్దనగరం అలెక్సంద్రియా. 4.1 లక్షల జనాభా ఉంది. 32 చదరపు కి.మీటర్లు వ్యాసార్థం వరకు విస్తరించింది. పారిశ్రామికంగా, పెద్దదే. ఓడరేవు ఉంది. ఇది ఒకనాడు ఫరో పాలించిన ప్రాంతం. క్రీ.పూ 331లో అలెగ్జాండర్ చక్రవర్తి స్థాపించాడు. ఆయన వద్ద పని చేసిన ప్రధాన శిల్పి డైనోక్రాట్స్ ఈ నగరం రూపకల్పన చేసి నిర్మాణానికి సహకరించాడు. ఇదిహెల్లెనిష్టులకు ప్రధాన కేంద్రం. యూదులు అధికంగా ఉన్ననగరం కూడా. విశేషం ఏమంటే బైబిలును, హీబ్రూ నుండి గ్రీకు భాషలోకి 70 పండితుల చేత రాయించింది ఇక్కడే. దీని 'సెప్తువజింత్' అంటారు.

రోమ్ తర్వాత అలెక్సంద్రియా క్రైస్తవ కేంద్రాల్లో రెండవది. యేసుక్రీస్తు శిష్యుడు పరిశుద్ధ మార్కు సువార్తికుడు దాదాపు 30 సం॥రాలు ఇక్కడ యేసయ్య గూర్చి ప్రచారం చేశాడు. ఒక్కడూ క్రైస్తవుడు కాలేదు. ఐతే చివరికి ఆయన హతసాక్షి అయ్యాడు. ఆ సమయంలో యేసయ్యలాగే "తండ్రీ వీరిని క్షమించమని" ప్రార్థించాడు. ఆ ప్రార్థన విన్న ఒక వ్యక్తి (వృత్తిరీత్యా చెప్పులు కుట్టేవాడు) పరిశుద్ధుడైన మార్కుని భక్తుని మాటలు విని అప్పటికప్పుడే యేసును అంగీకరించి ఇతరులకు ఆ వార్త తెలిపాడు. దాన్ని కొప్టిక్ మిషన్‌గా అనంతరం నామకరణం చేశారు. ఇది చాలా పెద్ద సంస్థ. ఇందులోనూ పోపు, కార్డినల్స్, ఆర్చ్‌బిషప్‌లు, బిషప్‌లు తదితర వ్యవస్థ ఉంది. ఈ సంస్థ ద్వారా విద్య, వైద్య, సామాజిక, మతపరమైన కేంద్రాలు నడుస్తున్నాయి. ఫ్రెంచ్, గ్రీకు, అరబిక్, ఇంగ్లీషు భాషలు ఇక్కడ వ్యవహారికంగా ఉన్నాయి.

బైబిల్లోను అలెక్సంద్రియాను గూర్చి ఉంది. అ.కార్య 18:24, 27:6, 28:11లలో ఈ వివరాలు చూడవచ్చు. మొదట వేదవిశ్వవిద్యాలయం ఈ పట్టణంలో స్థాపితమయ్యింది. ఆనాటి పండితుల్లో క్లిమెంట్, ఒరిగేన్, అతనేసియస్ ప్రముఖులు.

అలెక్సంద్రియా నుండి కైరోకి మంచిరోడ్డు రవాణా ఉంది. 6–8 లేన్ల రోడ్డు.రోడ్డు కిరువైపులా మంచి

పంటభూములు. పుచ్చకాయలు చాలా పెద్దవి కన్పించాయి. రోడ్డు ప్రక్క వ్యాపారం ఉంది. తడికెలతో కట్టుకున్న వ్యాపారుల ప్రతికొట్టుపైనా వాళ్ళ జాతీయజెండా కట్టారు. మంచి కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, రవాణా జరుగుతూ ఉంది. కైరోనగరం చేరేసరికి 1.30 గంటలయ్యింది. అందరికీ ఆకలనిపించింది. బస్‌లోనే ప్రతి ఒక్కరికీ 1.6 లీటర్లున్న వాటర్ బాటిల్ ఇచ్చారు. అక్కడ హోటల్‌లో మంచినీళ్ళు ఉండవు. కావాలంటే కొనితాగవలసిందే. 2 డాలర్లు వెచ్చించాలి. ఐతే మాకు ముందుగానే వాటర్ బాటిల్ ఇచ్చారు కాబట్టి ఆ బాటిల్ పట్టుకొని భోజనానికి దిగాము. అది విదేశంలో మొదటి భోజనం. మా పవిత్రయాత్రలోనూ భూమిపై తొలిసారిగా ఏర్పాటుచేసిన విందు. చికెన్, వంకాయబిరియాని, మటన్‌చాప్స్, బీఫ్‌బాల్స్, మరో ఆరురకాల తెలియని కూరగాయల వంటలు, మరో పదిరకాల కేకులు, ఐస్‌క్రీమ్, ఫ్రూట్ సలాడ్, పుచ్చకాయ ముక్కలు, అరటిపండ్లు యిచ్చారు. తినగలవారికి తిన్నంత. ఐతే మంచినీళ్ళు వాళ్ళివ్వరు.

అనంతరం హోటల్ తాబాకి ప్రయాణం. పదినిమిషాల్లో హోటల్‌లో దిగిన అనంతరం మా గది తాళాలు యిచ్చారు. తాళం అంటే మన ఎటిఎం కార్డ్‌లాంటిది. అది తలుపు కన్నంలో పెడితే టిక్ అంటూ తలుపు తెరుచుకుంటుంది. మా రాకకు ముందుగానే పేర్లు, రూమ్‌నంబర్లు సిద్ధంగా ఉన్నందువల్ల ఏమీ ఆలస్యంగాని ఇబ్బంది గాని లేదు. అప్పటికి సమయం 3 గం.లు. 6 గంటలకే మాకు మళ్ళీ నైలునది విహారం.

గదిచేరిన అనంతరం స్నానం, శుచి అయిన తర్వాత అలా మంచం మీద పడుకోగానే కునుకుపట్టింది. అందులోను అది స్టార్ హోటల్ కాబట్టి మరింత ఆహ్లాదకరంగా ఉంది. 5గం.లకు ఫోన్ కాల్ వచ్చింది, మళ్ళీ సిద్ధం. హోటల్ నుంచి బయటికి రాగానే మా బస్ సిద్ధం. ఓ పావుగంట ప్రయాణంలో నైలునదిలో విహారం. సరిగ్గా మేము వెళ్ళిన ప్రాంతంలోనే ఫరో కుమార్తెకు మోషే జమ్మిబుట్టలో లభించింది. అక్కడే గుబురుగా ఉండే జమ్మిపొదలుండేవని చెప్పారు. ప్రస్తుతం నైలునదిని ఆనుకుని 20-30అంతస్థుల ఆకాశసౌధాలున్నాయి.

అది మూడు అంతస్థులున్న పెద్దబోటు. లోపల అందంగా అలంకరించారు. వచ్చిన వెంటనే వెల్‌కం డ్రింక్ అందరికీ యిచ్చారు. ఎవరు కావలసినివి వాళ్ళు తాగవచ్చు. కాదంటే వాటికి అదనంగా పదిడాలర్లు చెల్లించాలి. అందుకని ముందే అడగడం మంచిది. భోజనం మాత్రం ఉచితం అది మన టూర్‌లోనే వస్తుంది. అక్కడ బెల్లీడాన్స్ ప్రత్యేకం. మన కాబరీ డాన్స్‌లాగే ఉంటుంది. గానాబజానాకి రకరకల కళాకారులు మనకు వినోదం కలిగిస్తారు. వాళ్ళ దేశపు నృత్యాలు, కళలు, మ్యాజిక్కులు ప్రదర్శిస్తారు. అలా ఆనందిస్తూనే మంచి బిరియాని, బన్‌లు, సూప్‌లు, మరో పదిరకాల వెజిటబుల్ సలాడ్స్, ఇంకా వెరైటీ ఫిష్ ఫ్రైలాంటివి ఇస్తారు. తిన్నవారికి తిన్నంత. దాదాపు 3 గంటలు నైలునదీ విహారం చేస్తూ రంగురంగుల దీపాల నడుమ దేదీప్యమానంగా వెలిగిపోతున్న నృత్యకళాకారులతో కలిసి మనం కూడా నృత్యం చేస్తూ విందారగించవచ్చు. పై అంతస్తులో రకరకాల వస్తువులు, ఫ్యాన్సీ వస్తువులు అమ్మకం ఉంటాయి. బేరం అడిగి తీసుకోవాలి. రేట్లు కాస్తంత ఎక్కువే. ఈజిప్షియన్ మమ్మీలు, పిరమిడ్లు, కీచైన్లు, ఫ్యాన్సీ ఆభరణాలు, బ్యాగులు ఉంటాయి. మా యాత్రలో కేవలం ఇహలోక సంబంధ గానాబజానా, వినోదనృత్యం ఇక్కడే ఉంటుంది. మిగిలిన అన్ని ప్రదేశాలు పవిత్రయాత్రకు ప్రతీకలే. నైలునదీ విహారయాత్రలోని విందు అనంతరం అలసటగా ఉన్నందువల్ల నిద్ర వస్తున్నట్టనిపించింది. 11గం.లకు తిరిగి మళ్ళీ తాబా హోటల్‌కి చేరాము.

ఆ రాత్రి అక్కడే సుఖమైన, క్షేమకరమైన, విలాసవంతమైన బస. ఉదయం 6గ.లకు మేలుకొలుపు. సామాను రాత్రికే దాదాపు సర్ధుకొని, ఉదయం శుచి, స్నానం పూర్తి చేసుకుని చిరునవ్వులు చిందిస్తూ రెండోరోజు యాత్రకు సిద్ధం. ఇక్కడ ఒక విషయం ప్రస్తావించాలి. మన 'లగేజి' రూమ్ ముందు పెడితే "బెల్‌బోయ్స్" తెచ్చి మన బస్ దగ్గరుంచుతారు. మన సామాన్లు గుర్తించిన అనంతరం బస్‌లో లగేజి అడుగున అమరుస్తారు. ఐతే మనం మన సామాన్లు సర్దేవరకూ గమనించుకోవాలి.

ఈజిప్ట్ (ఐగుప్తు దేశం) పేపర్(కాగితం) జన్మస్థలం. వివిధరకాల సుగంధద్రవ్యాలకు పుట్టినిల్లు. ప్రపంచ చరిత్రలో సంస్కృతి, సంప్రదాయాలు, జానపద చరిత్ర, పద్ధతులు అక్కడ నుంచే ప్రపంచదేశాలకు విస్తరించినట్టు చరిత్ర తెలియజేస్తుంది.

అనంతరం మంచి అల్పాహారం. ఇక్కడా తిన్నన్ని ఉడకబెట్టిన గుడ్లు, మాంసంతో చేసిన రోల్స్, కేకులు, జ్యూస్, పండ్లు, కాఫీ, టీ, బిస్కట్లు, బుల్స్‌ఐ (గుడ్డుతో చేసింది) ఓ పాతిక రకాలుంటాయి. తిన్నవారికి తిన్నంత ⋆

(మిగతా వచ్చేసంచికలో)

ప్రసంగ వేదిక



# క్లుప్త ప్రసంగాలు

## నిలకడగా ఉండుడి

1. విశ్వాసములో. 1కొరింథీ 16:13
2. ప్రేమలో. 1తిమోతి 4:11,12
3. రక్షణార్థమైన జ్ఞానములో. 2తిమోతి 4:14,15
4. పరిశుద్ధతలో. 2తిమోతి 2:15
5. విజ్ఞాపన చేయుటలో 1తిమోతి 5:5
6. ప్రార్థనలయందు. కొలస్సీ 4:2
7. సత్యకృపలో. 1పేతురు 5:12

## వ్యర్థము

1. భక్తి యాకోబు 1:26
2. విశ్వాసము. 1 కొరింథీ 15:17
3. ఆరాధన. మత్తయి 15:79
4. నీతి. గలతీ 3:1-5
5. మాటలు. 2పేతురు 2:18
6. ప్రవర్తన. ద్వితీ 32:21
7. జ్ఞానుల యోచనలు. 1కొరింథీ 3:20

## యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట

1. తెలివికి మూలం. సామె 1:7
2. జ్ఞానమునకు మూలము. సామె9:10, యిర్మియా 8,9
3. దీర్ఘాయువునకు కారణము. సామె 10:2
4. బహుదైర్యము పుట్టించును. సామె 14:26
5. జీవసాధనము. సామె 19:23
6. జీవపు ఊట. సామె 14:27
7. వినయమునకు ప్రతిఫలము. సామె 22:4

## యధార్థవంతు(లకు)ల

1. ఆయన తోడుగా వుందును. సామె 3:32
2. చీకటిలో వెలుగు పుట్టును. కీర్తన 112:4
3. గుడారము వర్ధిల్లును. సామె 14:11
4. పిల్లలు ధన్యులగుదురు. సామె 20:7
5. ప్రార్థన ఆయనకు ఆనందకరము. సామె 15:8
6. దేశమందు నివసింతురు. సామె 2:21
7. నీతి వారిని విమోచించును. సామె 11:6

## సైనికుడు

1. సణుగులు, గొణుగులతో సాగినవారు. నిర్గ 17:2,3
2. ఐగుప్తు బానిసత్వము మరువనివారు. సంఖ్యా 11:5
3. ఐగుప్తీయులతో కలసిపోతామన్నవారు. నిర్గ 14:11
4. నాయకులపై తిరుగుబాటు చేసి నశించినవారు. సంఖ్యా 16:32,33
5. భయపడి నశించినవారు కొందరు. సంఖ్యా 14:33
6. అపజయముతో నశించిన కొందరు. సంఖ్యా 14:45
7. అవిశ్వాసముతో కూలినవారు. సంఖ్యా 14:30

## దేవుని వశము

1. భూమ్యాకాశములందుండు సమస్తము. 1 దిన 29:11-13
2. కాలములు, సమయములు. కీర్తన 31:15; అ.కా 1:16
3. మనుష్యుని నడతలు. సామె 20:24
4. తీర్పు తీర్చుట. సామె 16:33; 29;26
5. మరణము తప్పించుట ప్రభువైన యెహోవా వశము. కీర్తన 69:20
6. ఆలోచన చెప్పుటయు, లెస్సైన జ్ఞానము నిచ్చుట. సామె 8:14
7. మన మార్గములు. దాని 5:22,23



శ్రీమతి. యన్. లిల్లీభాస్కరరావు

# ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము

**1947 ఆగష్టు 15**న భారత దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపబడిన సుదినం, శుభదినం. అదే స్వాతంత్ర్య మహోత్సవ దినం. పరాయి ప్రభుత్వ దాస్య శృంఖలాల నుండి విడుదల, విమోచన లభించిన మన దేశప్రజల హృదయాలు సంతోషముతో నిండి సంబరాలు చేసికొన్న పరమదినం. అనేక సమరయోధులు, మహానాయకులు, రాత్రింబగళ్ళు పోరాడి అసువులు బాసిన వారికే ఈ ఘనత చెందుతుంది. దేశం పట్ల వీరికున్న ప్రేమత్యాగం భక్తి ఎంతో శ్లాఘనీయం. స్వాతంత్ర్యము సంపాదించిన నాయకుల విషయంలో దేవునికి స్తోత్రములు చెల్లిద్దాం.

స్వాతంత్రముగా జీవించాలనే కోరిక ప్రతి మనిషికి ఉంటుంది. చిన్న పెద్ద తేడా ఉండదు. స్కూలు విడిచిపెట్టిన వెంటనే గెంతులు వేసికొంటూ క్లాసురూము నుండి గేటు దాటే వరకు పరుగెత్తుతారు పిల్లలు. ఇది మానవులకే కాదు, నోరులేని జంతువులు పక్షులు కూడ పరుగెత్తుతూ ఎగురుతాయి. ఎందుకంటే వాటికి స్వేచ్ఛకావాలి.

### ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము

మనకు కావల్సింది ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము. ఎవరైతే పాపంలో కూరుకుపోతారో వారు పాపానికి దాసులే. యేసుక్రీస్తుకు మాత్రమే పాపబంధకాల నుండి విడిపించడం సాధ్యమవుతుంది. ఎవరైనా పాపములో ఉంటే వారు దేవుని కుమార్తెలు కుమారులు కారు. నిజమైన స్వాతంత్ర్యము యేసునందే లభిస్తుంది. ఈ స్వాతంత్ర్యము మన జీవితాలను ఏ విధముగా నడిపిస్తుందో ఆ స్వాతంత్ర్యాన్ని ఎలా ఎంతగా మనం భద్రపర్చుకోవాలో అపొస్తలుడైన పౌలు గలతీ సంఘానికి ఉత్తరం వ్రాస్తూ "ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి క్రీస్తు మనలను స్వాతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరలా దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడని" (గలతీ 5:1) హెచ్చరించాడు.

కాని కొందరు మతోన్మాదులు సైతానువలె దేవుని బిడ్డలను తాత్కాలిక సుఖభోగాల కోసం సంతోషానందాన్ని కల్పిస్తూ వారిని స్వాధీనం చేసికొంటున్నారు. మరి కొందరు యేసు అనుచరులుగా స్వాతంత్ర్యయోధులుగా చెప్పుకొంటూ జీవితంలో మార్పులేకుండా యేసయ్య ఇచ్చిన స్వాతంత్ర్యమును అడ్డుపెట్టుకొని తప్పుడు మార్గాన పయనిస్తూ పాపపు బానిసత్వములో మ్రగ్గిపోతున్నారు.



## అత్యున్న స్వతంత్రులం

ఈ విధంగా మనిషి పాపానికి బంధీయై స్వాతంత్ర్యము కోల్పోయి నందున రెండువేల పది సంవత్సరాల క్రితమే యేసు ఈ లోకమునకు శరీరధారిగా వచ్చి పాపమనే కట్లచేత బంధింప బడిన నిన్ను నన్ను బంధకాలనుండి విడుదల నిచ్చి అత్యున్న స్వతంత్రులనుగా చేసాడని మరువకూడదు. నరకం నుండి, దేవుని ఉగ్రత నుండి కాపాడబడాలంటే మనకీ స్వాతంత్ర్యం కావాలి. మన జీవితాలకు క్రీస్తే నాయకుడిగా నావికుడుగా ఉంటే మనకింకా ఏమి కావాలి! శాంతి, సమాధానము, నెమ్మది మనలో నిత్యము నివసిస్తాయి. దీన్ని బట్టి పౌలు గలతీ సంఘముతో ప్రస్తావించినది రాజకీయపరమైన స్వాతంత్ర్యము గురించి కాదుగాని ఆత్మసంబంధమైన స్వాతంత్రము గురించేనని తెలుస్తుంది. రాజకీయ స్వాతంత్ర్యము ఇహలోక సంబంధమైన వాటికే పరిమితము గాని ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము, శాంతి, సమాధానము పొందలేము. ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము మానవుని నూతన జన్మకు సాదృశ్యం. ఇది దేవుని రాజ్యంలో అనుభవించే స్వాతంత్ర్యం. పెంతెకోస్తు దినమున శిష్యులపై ఇతర విశ్వాసులపై పరిశుద్ధాత్మ కుమ్మరింపబడగా క్రీస్తు రాజ్యస్థాపన భూలోకమందు రూపొందించబడెను. (అ.కార్య 2:1) ఈ రాజ్యమే ఆధ్యాత్మిక స్వాతంత్ర్య రాజ్యం.

యోహాను 1:12 ప్రకారము యేసుని అంగీకరించిన వారికి దేవుని పిల్లలమయ్యే అధికారం లభిస్తుంది. అప్పుడు ఆత్మతో సత్యంతో ఆయన్ని ఆరాధించగలము.

## సత్యము– స్వాతంత్ర్యము

సత్యానికి స్వాతంత్రానికి అవినాభావ సంబంధముంది. యేసుక్రీస్తే సత్యం. మనము సత్యాన్ని తెల్సికొనుట ద్వారా స్వతంత్రులమై ఆయన బిడ్డలుగా జీవించగలము. మతనిష్ట, మూఢవిశ్వాసం గలవారికి యేసు చేసిన హెచ్చరిక ఏమంటే "మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యాన్ని గ్రహిస్తారు. అప్పుడు సత్యం మిమ్మల్ని స్వతంత్రులుగా చేయును." అందుకు వారు "మేము అబ్రాహాము సంతానము. మేము ఎన్నడు ఎవనికి దాసులమై యుండలేదే" అన్నారు. అందుకు యేసు పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడే అని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానెను. కుమారుడు మిమ్మును స్వతంత్రులుగా చేసిన ఎడల మీరు నిజముగా స్వతంత్రులగుదురు (యోహాను 8:31,32) అంటే ఇది ఆత్మ సంబంధమైన విడుదల. మనము సత్యాన్ని తెలిసికొనుట ద్వారానే ఇది సాధ్యమవుతుంది. ఆయన బోధలకు చెవియొగ్గి విని విశ్వసించి ఆయన యందు నిలిస్తే సత్యాన్ని గ్రహిస్తాం. అప్పుడు సత్యమే మనల్ని స్వతంత్రులుగా చేస్తుంది.

## సాత్వికము – స్వాతంత్ర్యము

క్రైస్తవ స్వాతంత్ర్యము పొందాలంటే సాత్విమభ్యసించాలి. యేసు ఈ లోకానికి తెలియచేసిన దేమంటే "నేను సాత్వికుడును, దీనమనస్సుగలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణమునకు విశ్రాంతి దొరుకును" (మత్తయి 11:29) యేసు యొద్ద ఎవరైతే సాత్వికము నేర్చుకొంటారో వారి హృదయంలో పాపేచ్ఛలు అంతరిస్తాయి. మారుమనస్సు పొంది దేవునియందు భయభక్తులు గలవారై వ్యక్తిగతంగా ఆత్మీయానుభవము పొందుటే కాక దేశానికి మేలురకమైన జీవితాన్ని ప్రత్యక్షపరుస్తారు. అందుకే సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించు కొందురని ప్రభువు బోధించాడు.

## ముగింపు

ప్రధాన మంత్రులు, ముఖ్య మంత్రులు, గవర్నర్లు, అధ్యక్షులు, మన దేశనాయకులు ఈ దేశాన్ని శాంతియుతంగా పాలించుట కోసం పరలోక జ్ఞానము అనుగ్రహించమని పరిశుద్ధాత్ముని వేడుకొందాము. అది మన విధి. స్వాతంత్ర్య సమర యోధులకు ప్రజలందరు అండగా నిలిచియున్నట్లు సేవకులకు కాపరు లకు అండగా నిలవాలి. ఇది ప్రతి విశ్వాసి కర్తవ్యము. దేవుని బిడ్డలంగా యేసయ్య మనకిచ్చిన స్వాతంత్ర్యాన్ని అందరికి తెలియ చేయుటకు పత్రికవలే ఉందాము ✶



డా॥ యేలూరి ఆశీర్వాదం

# నిజ స్వాతంత్ర్యం

నేడే స్వాతంత్ర్య దినం-వీరుల త్యాగ ఫలం- నేడే నవోదయం - నేడే ఆనందమయం, పాడవోయి భారతీయుడా- ఆడి పాడవోయి విజయగీతిక' అని శ్రీశ్రీగారు వ్రాశారు.

ఏదో ఒక్క రోజున, ఎవరో ఒక్కరు కృషిఫలితంగా మనకు స్వాతంత్ర్యం రాలేదు. ఎన్నో ఉదయాల ఫలితం, ఎందరో నాయకుల కృషి, ప్రాణ త్యాగదనుల సమర యోధుల పుణ్యఫలం నేటి స్వాతంత్ర్యం. ఎంతో పర్వదినం, ఎందరో మహానుభావులు అందరికి వందనములు. అమరవీరులకు జోహార్లు.

భారత ఉపఖండం, భారత దేశం ప్రపంచంలో కెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. పరిపాలనా దక్షత గల నాయకులు. మనము సంపూర్ణ భక్తియు, మాన్యతయు కలిగి నెమ్మదిగాను, సుఖముగాను బ్రదుకునిమిత్తము అన్నిటికంటే ముఖ్యముగా మనుష్యులందరి కొరకును, రాజుల కొరకును, అధికారులదరి కొరకును విజ్ఞాపనములు ప్రార్థనలును, యాచనలును, కృతజ్ఞతా స్తుతులును చేయవలెనని హెచ్చరించుచున్నాను.

- అపొస్తలుడైన పౌలు (1 తిమోతి 2:1-2)

దేశమా, దేశమా, దేశమా యెహోవా మాట వినుము.

- యిర్మియా 22:29

నా పేరు పెట్టబడిన నాజనులు తమ్మును తాము తగ్గించుకొని ప్రార్థన చేసి, నన్ను వెదకి, తమ చెడు మార్గములను విడిచిన యెడల, ఆకాశమునుండి నేను వారి ప్రార్థనను విని వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును. - 2దిన 7:14

క్రైస్తవులు అజాత శత్రువులు. అందరి కొరకు దేశం కోసం దేశప్రజల కోసం ప్రార్థించెదరు. ఎన్నో సేవాసంస్థలు, ఎన్నో విధములల పరిచర్యలు చేస్తున్నారు. మదర్ థెరిస్సా చిరస్మరణీయురాలు. నెల్సన్ మండేలా నల్లజాతి (నీగ్రోజాతి) కొరకు ఎంతో కృషి చేసాడు.

**'స్వాతంత్ర్యం నా జన్మహక్కు'** *- బాలగంగాధర తిలక్.*

**'స్వేచ్ఛ - స్వాతంత్ర్యలనేది ప్రజాస్వామ్య దేశానికి ప్రాతిపదికలు.'**

*-అరిస్టాటిల్*

**'నాకు స్వాతంత్ర్యం ఇవ్వండి, లేదా మరణం యివ్వండి"**

- ప్యాట్రిక్ హెన్రీ (అమెరికా దేశభక్తుడు)

భౌతిక స్వాతంత్ర్య (రాజకీయ స్వాతంత్ర్యం) గురించి అందరికి తెలుసు. "అసలైన స్వాతంత్ర్యం, నిజస్వాతంత్ర్యము, ఆధ్యాత్మిక



స్వాతంత్ర్యం గూర్చి అందరికి తెలియదు. తెలుసుకొనినవారికే నిజ స్వాతంత్ర్యం వచ్చినట్లు లెక్క. మరి నీకా ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం వచ్చిందా?

**దాస్య విమోచన:**

దాదాపు 430 సంIIరాలు హెబ్రీ జాతి (ఇశ్రాయేలీయులు) ఐగుప్తు చెర(బానిసత్వం)లో మగ్గిన తరువాత, దేవుడు వారి మూలుగును విని, మోషే – అహరోనులను పంపి ఆ జాతికి విడుదలనిచ్చాడు. పస్కాపశువు వధ ద్వారా విమోచన.

**పాపదాస్య విమోచన**

పాపమానవాళి సైతానుకు దాసులైనందున వారు నరకప్రాప్తులు కాకుండ ప్రభువైన యేసు తన అమూల్య రక్తమును (సిలువ యజ్ఞంలో గొర్రెపిల్ల వధింపబడి) కార్చాడు. తద్వారా విమోచన.

**సాతాను కట్లనుండి విడుదల**

18 సంIIరాల నుండి అపవాది చేత బంధింపబడి, గూనిదైన స్త్రీని యేసుక్రీస్తు స్వస్థపరచాడు. ఆ అబ్రాహాము కుమార్తెకు అపవాది కట్ల నుండి విడుదలనిచ్చాడు. చీకటిలో నున్నవారిని వెలుగులోనికి తెచ్చుటకును, బంధింపబడిన వారికి విడుదలనివ్వడానికి దుఃఖించువారికి ఓదార్పు (సంతోషం) నివ్వడానికి ఆయన వచ్చాడు.

**సత్యము ద్వారా స్వాతంత్ర్యం**

సత్యము మిమ్మును స్వతంత్రులునుగా చేయును. వాక్యమే సత్యము. వాక్యమే దైవము. ఆ వాక్యమే యేసుప్రభువు.

**ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము**

సహోదరులారా మీరు స్వతంత్రులుగా ఉండుటకు పిలువబడితిరి. ఆ స్వాతంత్ర్యమును శారీరక క్రియలకు హేతువు చేసికొనక, ప్రేమగలిగినవారై యొకని కొకడు దాసులై యుండుడి. ధర్మశాస్త్రమంతయు ప్రేమలోనే ఇమిడి ఉంది.

**మహిమగల స్వాతంత్ర్యము**

సృష్టి, నాశనమునకు లోనయిన దాస్యములో నుండి విడిపింపబడి దేవుని పిల్లలు పొందబోవు మహిమగల స్వాతంత్ర్యము పొందుదునను నిరీక్షణ కలదై, స్వేచ్ఛగా కాక దానిని లోపరచిన వాని మూలముగా వ్యర్థపరచబడెను. సృష్టియావత్తు ఇదివరకు ఏకగ్రీవముగా మూలుగుచు ప్రసవవేదన పడుచున్నదని యెరుగుదుము. దత్తపుత్రత్వము కొరకు (విమోచన కొరకు) ఉందాము.

**అపొస్తులుడైన పౌలు హెచ్చరిక**

అన్నిటియందు నాకు స్వాతంత్ర్యము కలదు, గాని అన్నియు చేయదగినవి కావు. అన్నిటియందు నాకు స్వాతంత్ర్యము కలదు. గాని లోపర్చనొల్లను, చింతపడవద్దు గాని స్వతంత్రుడవగుటకు శక్తి కలిగినయెడల, స్వతంత్రుడవగుట మరి మంచిది. ప్రభువు దాసుడు ప్రభువు వలను స్వాతంత్ర్యము పొందినవాడు. ఆ ప్రకారమే స్వతంత్రుడైయుండి పిలువబడినవాడు క్రీస్తు దాసుడు. అయినను మీకు కలిగియున్న ఈ స్వాతంత్రమ వలను బలహీనులకు అభ్యంతరము కలుగకుండ చూచుకొనుడి. అన్ని విషయములందు స్వాతంత్ర్యమున్నను అన్నియు చేయతగినవి కావు.

**సిలువ ద్వారా స్వాతంత్ర్యం**

సాతాను నుండి విడుదల, గత పాపాల నుడి విడుదల, ప్రస్తుత పాపాలనుండి విడుదల, వ్యాధి,శాపం, తీర్పు నుండి విడుదల, నిత్యమరణం నుండి విడుదల.

నిజమైన ఆధ్మాత్మిక స్వాతంత్ర్యమును మనకు అనుగ్రహించిన ఆ యేసుక్రీస్తును మన జీవితాలలో కలిగి ఆయన రాజ్యములో ప్రవేశించుదుము గాక!

“ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి, మరల దాస్యమును కాడి క్రింద చిక్కుకొనకుడి” గలతీ 5:1 దేవుడు మనలను దీవించును గాక! ఆమేన్!! ★

**ముఖ్య విషయం**

స్పందన చందాదారులందరూ మీరు మీ కానుకలు, చందాలు పంపేటప్పుడు దయచేసి మీ సెల్ నంబరును తప్పక తెలియజేయాలని మనవి. మీరు పంపిన డబ్బు అందగానే మీ డబ్బు అందిందని, మీ చందా అయిపోయినప్పుడు వెంటనే SMS మెసేజ్ మీ సెల్‌కు వస్తుంది. విషయాలు ఎప్పటికప్పుడు మీకు తెలియజేయటానికి అనువుగా ఉంటుంది. తప్పక మీ సెల్ నంబరు పంపాలని మనవి ★

– సర్కులేషన్ ఇన్‌చార్జ్

## బాలస్పందన



పాస్టర్. పి.సురేష్‌బాబు

# పగిలిన కుండ

సండేస్కూల్‌లో కొందరు పిల్లలు వరుసగా నిలవబడి ఇంగ్లీషులో కోరస్‌లు చక్కగా పాడుతున్నారు. తరువాత కొందరు చక్కగా వాయిద్యాలు వాయిస్తున్నారు. కొందరు చక్కగా నాట్యం చేస్తున్నారు. కొందరు పిల్లలు చక్కగా బైబిల్ కథలు చెపుతున్నారు. వారిని వారి సండేస్కూల్ మాస్టారు గారు గైడ్ చేస్తూ, ఎక్కడైనా తప్పులు దొర్లితే సరిచేస్తూ అందరిని కనిపెడుతూ ఉన్నారు. వీరినందరిని చాలా ఆశక్తిగాను, ఆశ్చర్యంగాను చూస్తూ దూరంగా జీవన్ అనే ఒక పిల్లవాడు నిలుచున్నాడు. తనకు ఈ పాటలు, వాయిద్యాలు, డ్యాన్స్‌లు ఏమి రావని సండేస్కూల్‌కు రావడం మానేశాడు. కొద్దిసేపు తరువాత సండేస్కూల్ మాస్టరు జీవన్‌ను గమనించి రెండు మూడు సార్లు సండేస్కూల్‌కు వచ్చిన జీవన్ ఆ తరువాత రాకుండా, ఇప్పుడు దూరంగా వుండి వీరిని ఎందుకు గమనిస్తున్నాడో ఆలోచించడం మొదలుపెట్టాడు.

తరువాత ఆదివారం సండేస్కూల్‌కు ముందుగానే మాస్టారు జీవన్ ఇంటికి వెళ్ళారు. జీవన్‌ను కలిసి "జీవన్ సండేస్కూల్‌కి వెళదాం రా!" అన్నారు. జీవన్ కొంచెం సిగ్గుతో "నేను రాను మాస్టారు" అన్నాడు. జీవన్‌లో ఏదో సిగ్గు, లేదా భయం గమనించి "సరే ఈ ఒక్క రోజుకు రా! ఆ తరువాత నీ యిష్టం" అని చెప్పి కొంచెం బలవంతంగానే మాస్టారు సండేస్కూల్‌కు తీసుకొని వెళ్ళారు. సండేస్కూల్‌లో కూర్చొన్న జీవన్ తన చుట్టూ చలాకీగా ఉన్న పిల్లలందరిని చూచి కొంచెం ఇబ్బందిగాను, సిగ్గుగాను ఉంటున్నాడు.

మాస్టారు సండేస్కూలు పిల్లలందరిని చూచి నవ్వుతూ "పిల్లలు మీకు ఒక కథ చెబుతాను! వింటారా!" అని అడిగి అడగడంతోనే పిల్లలందరూ పెద్ద పెట్టున "వింటాం! వింటాం! చెప్పండి!" అని గట్టిగా అరిచారు. సరే చెబుతాను అల్లరి చేయకుండా వినండి అంటూ కథ మొదలుపెట్టారు.

అనగనగా ఒక ఊరిలో ఒక యజమాని దగ్గర ఒక పనివాడు ఉన్నాడు. ఈ పనివాడు రోజు తన కావిడిలో రెండు కుండలను పెట్టుకొని చెరవునుండి వాటినిండుగా నీళ్ళు మోసుకొని తన యజమాని ఇంటికి తీసుకువస్తూ ఉండేవాడు. అయితే ఆ రెండు కుండలలో ఒక కుండ కొంచెం బీటలిచ్చింది, అంటే కొంచెం పగిలింది. అందువలన ఆ పనివాడు ఆ రెండుకుండల కావిడిని మోసుకొని తన యజమాని



ఇంటికి వచ్చేసరికి పగిలిన కుండలో నీళ్ళు సగం దారి పొడుగునా కారిపోతూ ఉండేవి. ఒకటిన్నర కుండతో మాత్రమే నీళ్ళు ఇంటికి వచ్చేవి.

ఇలా ఒక సంవత్సరం గడిచిపోయింది. కాని ఆ పనివాడు ఏ మాత్రం బాధపడటంగాని, ఆ కుండను తీసివేసి కొత్తకుండను పెట్టడం కాని చేయడం లేదు. పిల్లలు ఎందుకనో మీరు చెప్పగలరా" అని మాస్టారు పిల్లల వైపు చూస్తూ కథ మధ్యలో వారికి ఒక ప్రశ్న వేశాడు. కొంతమంది తెలియదన్నారు. కొంతమంది ''పనివాడికి బద్ధకమన్నారు'' మరికొందరు "డబ్బుల్లేవేమో" అన్నారు. మాస్టారు వారి సమాధానాలకు ఒక చిరునవ్వు నవ్వి "సరే అదేమిటో కథలో చూద్ధాం" అంటూ మళ్ళీ కథలోనికి వెళ్ళాడు.

సంవత్సరం గడిచిపోయిన తరువాత ఒకరోజు ఈ సగం పగిలిన కుండ రోజు తన తోటిదైన కుండ పూర్తిగా నీళ్ళను తీసుకువస్తుంటే తనుమాత్రం సగం నీళ్ళను ఇంటికి చేర్చగలుగుతున్నందుకు బాధపడుతూ, అవమానంతో దిగులుగా ఉంది. ఆ రెండవ కుండ ఈ పగిలిన కుండతో అంటుంది "నేను ఒక సంవత్సరంలో తెచ్చిన నీళ్ళు నీవు తేవాలంటే నీకు రెండు సంవత్సరాలు పడుతుంది" అని కొంత డాంభికంగా చెప్పింది. మరింత దిగులుతో నిండిపోయింది కుండ. దిగులు మాత్రం కుండలోనుండి నీళ్ళు జారినట్టు పోవడం లేదు. ఎక్కువవుతుంది. తనును బాగుచేయాడానికి ఏమైనా వీలవుతుందా? పగలగొట్టి మరలా కుండగా చేయడానికి వీలవుతుందా? అంటే ఇక ఏ అవకాశం లేదు ఉంటే ఇలా! లేదా పూర్తిగా పగిలిపోవడం.

ఈ లోగా పనివాడు మరలా కావిడితో నీళ్ళకని బయలుదేరాడు. ఈ పగిలిన కుండ పనివానితో "అయ్యా ఎందుకింకా నన్ను వాడతావు? నేను సగం నీళ్ళే కదా తెస్తున్నాను. ఈ అవమానం నేను తట్టుకోలేక పోతున్నాను. నన్ను పగలకొట్టి పక్కనపడేయ"మని ప్రాధేయపడుతుంది. పనివాడు ఒక్క క్షణం ఆగి కావిడిని అలాగే మోసుకుంటూ ముందుకు సాగిపోయాడు. చెరువులో నీళ్ళు ముంచిన తరువాత పనివాడు ఆ పగిలిన కుండతో "ఇప్పుడు మనం వెళ్ళే దారి జాగ్రత్తగా గమనించు" అన్నాడు. అలాగే ఇంటికి వెళ్ళిపోయి కుండలను దించి ''ఏమైనా గమనించావా?'' అని పనివాడు ఆ పగిలిన కుండను అడిగాడు. అప్పుడు ఆ కుండ "మనం వచ్చిన దారిలో నేను ఉన్న వైపున చాలా పూలమొక్కలను చూచాను" అంది. ''మరి నిండుకుండ ఉన్నవైపు ఏమున్నాయి" అని అడిగాడు. "అంతా కొండ రాళ్ళు ముళ్ళు ఉన్నాయి" అంది. ఇప్పుడు ఆ కుండను యజమాని ఇంటిలోనికి తీసుకువెళ్ళాడు. అక్కడ దారిలో చూచిన పూలమొక్కల పువ్వులు అలంకరించి ఉన్నాయి. మంచి సువాసన వస్తుంది. అప్పుడు ఆ పనివాడు "నీలో నుండి కారిపోతున్న నీళ్ళు వృథా కాకుండా దారి పొడుగున నేను పూలమొక్కల విత్తనాలు వేసాను. నీవు రోజు పోసే నీళ్ళ ద్వారా అవి మొలచి, పువ్వులు కాస్తున్నాయి. రోజూ మన యజమానికి నువ్వు నీళ్ళతోపాటుగా పువ్వులు కూడా ఇస్తున్నావు" అని నవ్వుతూ చెప్పాడు. అంతే ఆ పగిలిన కుండలోనుండి ఒక్కసారిగా చెమ్మ(అనందబాష్పలేమో!) బయటకు బడాబడా వచ్చింది. ఆ పనివాని వైపు కృతజ్ఞతతో మనసులోనిండిన ఆనందంతో చూస్తూ విలువలేని తనను ఎంత విలువగలదానిగా చేశాడోనని కన్నీళ్ళు కార్చింది."

"పిల్లలు మనమేమి పనికిరామని అనుకోకూడదు. నీవేమి చేయగలవో నీక తెలీదు గాని దేవునికి తెలుసు. నిన్ను చక్కగా దేవుడు వాడుకుంటాడు. నీవు "తక్కువ" అని నీవెప్పుడు అనుకోవద్దు. దేవుడు నిన్ను ఎక్కువగానే ఉంచాడు. అది మంచి సమయములో నీకు తెలుస్తుంది." అని చెప్పి సండేస్కూల్ ముగించారు. అందరు సంతోషంతో వెళ్ళిపోయారు. మాస్టారు దగ్గరకు జీవన్ వచ్చి "మాస్టారుగారండీ నాకు ఈ కథ చాలా నచ్చింది. నేను ప్రతీవారం తప్పకుండా సండేస్కూల్‌కు వస్తాను. దేవుడు నన్ను ఎలాగైనా వాడుకుంటాడు. నేను సండేస్కూల్‌లో ఏదో ఒక పని చేస్తా" నంటూ తన సమస్యకు ఏదో సరైన సమాదానం దొరికినట్లు సంతోషంతో గెంతులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. మాస్టారు గారూ జీవన్‌వైపు చూస్తూ సంతృప్తిగా దేవునికి కృతజ్ఞతలు చెప్పారు ✶

(13వ పేజి తరువాయి)

**6) నశించిపోతున్న లోకానికి ప్రాణాధారమును జీవముతో కూడిన వర్తమానవ్వాలి**

సేవకుడు తన యింటిని, ఊరును విడిచి దూర ప్రాంతాలకు వెళ్ళి సేవ చేసేటప్పుడు హింసలు, ఎగతాళులు, శోధనలు సహించి సమర్పించుకోవాలి. "క్రీస్తు మన పాపముల కొరకు వేదన, శోధనలు సహించి, మనకోసం ప్రాణంపెట్టి, మనల్ను ప్రేమించాడు.

నీవు ఎవరికైనా సువార్త ప్రకటిస్తే అది దేవునిచే యివ్వబడాలి. అది జీవ, మరణములకు చెందినది. నీ గృహనిర్వాహకపు లెక్క ఆయన నిన్ను అడుగుతాడు. దేవుడు నిన్ను బోధకులు నిలబడే స్థలంలో వున్నత స్థానంలో నిలబెట్టాడంటే మనుష్యుల యిష్టానుసారముగా నడుచుకొని వారిని సంతోషపెట్టడానికి కాదు. లేక మనల్ని మనం యితరులకు చూపించుకొనుటకు కాదు. ఉదాహరణకు మనకు టెలిగ్రాం వచ్చిందనుకోండి. ఆ వార్తను ఆతృతతో చదవడం వలన ఆ వార్తను తెచ్చిన వ్యక్తిని మర్చిపోతాము. ప్రియ సేవకా! మనుష్యులు నిన్ను గూర్చి, నీ బోధను గూర్చి ఏమనుకుంటున్నారు? "ఎంత మంచి ప్రసంగం చేసావు" అని చెప్పుకుంటున్నారో లేక "ఎంత గొప్ప యేసయ్యను, ఎంత గొప్ప రక్షకుడు'' అని చెప్పుకుంటున్నారో. పరిశుద్ధాత్మను ఘనపర్చే వర్తమానము నీవు కలిగివుండాలి. నీవు ప్రసంగించిన తరువాత పాపములను ఒప్పుకొన చేయిస్తున్నావా! ఆత్మలు రక్షింపబడి, విశ్వాసులు క్షేమాభివృద్ధి పొందడం నీవు చూస్తున్నావా! **గడచిన ఎన్నో సంవత్సరాల నుండి ప్రభువు నాకు ఈ భారాన్ని నా హృదయంలో వుంచాడు. వర్తమానము అందించిన తర్వాత రక్షణ తీర్మానపు పిలుపు నేను యిస్తుండగా వారు కార్చే ప్రతి కన్నీటి బోట్టు యేసయ్య పాదాలను తడుపుతుంటే నేను ఎంతో తృప్తిచెందేవాణ్ణి.** నీ వర్తమానము పరిశుద్ధాత్మ నుండి కలిగితే నీ వెన్నడూ సిగ్గుపడనవసరం లేదు. భయపడనవసరం లేదు. ఆయన శక్తిపై నమ్మకముంచి బయలుదేరి వెళ్ళి మాట్లాడండి!

**7) ఫలముల కోసం నిరీక్షించే విశ్వాసం గలిగి ఉండాలి**

చాలామంది సేవకులు వెంటవెంటనే ఏదో ఒకటి జరగాలి అని అనుకుంటారు. ఫలాలు కోసం మనం ఎదురుచూడాలి. ఒకప్పుడు ఓ యౌవన బోధకుడు సేవలో ఫలితం కనబడక అధైర్యపడి స్పర్జన్‌గారి దగ్గరకు వచ్చాడు. "నీవు ప్రసంగించినప్పుడు ఫలితము కనబడాలని నిరీక్షించుట లేదుగదా?" అని స్పర్జన్ గారు ప్రశ్నించారు. అతడు "నిరీక్షించడం లేదు" అని జవాబు చెప్పాడు. అందుకు స్పర్జన్ "అందువలననే నీ సేవలో ఫలితాలు కనబడడం లేదు" అని చెప్పారు.

ఓ లాయరు కోర్టులో వాదించేటప్పుడు ఉల్లాసానికి మాట్లాడడు. అతడు తీర్మానం నిమిత్తం వాదిస్తాడు. మనమంతా నిశ్చయమైన విశ్వాసం కలిగి వుండాలి.

**8) పరిశుద్ధాత్మాభిషేకము పొంది పనిచేయాలి**

"మీరు పైనుండి శక్తి పొందేవరకు పట్టణములో నిలిచి వుండుడి." వాళ్ళు నిలిచియున్నారు. "పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చినపుడు మీరు శక్తి నొందెదరు గనుక నాకు సాక్షులైయుందురు." అభిషేకము పొంది చేసే ఒక్క ప్రసంగము, ఆత్మ శక్తిలేక చేసిన వెయ్యి ప్రసంగాల కంటే విలువైనది.

దేవుడు మనల్ను వాడుకొనేలాగున మనం ఈ ఎనిమిది గుణలక్షణాలు కలిగి యుండడానికి దేవుడు మనకు సహాయం చేయునుగాక! అదే దేవునికి మహిమకరమైన సేవ! దేవునికి స్తోత్రం!!! ★

**జూన్ గ.ను.క సమాధానాలు**

**అడ్డం**

1.పరలోక 4.సంపద 6.నరహత్య 8.యజమానుని 9.తాళు 10.మనస్సాక్షి 12.మాన్యత 15.జీవపువాసన 19.నురుపిడి 20.దేవుడువు 21.నాలుకను 23.ఒట్టు 24.భక్తితోను

**నిలువు**

1.పదియవ 2.లోకమాలిన్యము 3.అర 5.దయాళులు 7.హదస్సా 11.నలువది 13.మూస 14.స్తెఫను 16.వాడి 17.నడువుడి 18.నడికట్టు 20.దేవోక్తి 22.సో

(17వ పేజి తరువాయి)

వానిని, తన ఆయుధములు మోయువానినే గుర్తు పట్టలేకపోయాడా!

**ఎవరు అర్థం చేసుకున్నారు**

అసలు దావీదు గొప్పదనాన్ని, మాటలను అర్థం చేసుకున్నవారెవరు? ప్రవక్తయైన సమూయేలు తన ఇంటికి వచ్చినప్పుడు, దేవుడు కోరుకొనినివాడు దావీదే అని అతని తండ్రియైన యెష్షయి అర్థం చేసుకున్నాడా! యుద్ధ రంగంలో దావీదు మాటలు అతని అన్న అర్థం చేసుకున్నాడా! అతని శూరత్వాన్ని సౌలు అర్థం చేసుకున్నాడా! దేవుని ఆత్మ అతనికి తోడైఉండెనని ఎవరైనా అర్థం చేసుకున్నారా!

ఆ మాటకొస్తే, యేసేపును అన్నలు అర్థం చేసుకున్నారా! అతని మాటలు తండ్రి యాకోబు అర్థం చేసుకున్నాడా! అంటే లేదనే చెప్పాలి. ఇలాంటి ఉదాహరణలు దైవగ్రంథంలో లెక్కకు మిక్కిలిగా కనిపిస్తాయి. అయితే ఎవరు అర్థం చేసుకున్నారని ఒక గొర్రెల కాపరి గొప్ప విజయం సాధించగలిగాడు! ఎవరు ఆసరాగా ఉన్నారని యేసేపు దేవునిలో నిలిచి వంశాన్నే ఆదుకొనగలిగాడు.

**ముగింపు**

కొంచెం కూల్‌గా ఆలోచిస్తే నేస్తం, ఒకరిని ఇంకొకరు అర్థం చేసుకొనక పోవడమే మానవనైజం. ఒకరిని ఒకరు (ఎవరిని వారు) అర్థం చేసుకోవడమే మానవ విజయరహస్యం. నీవు చేయాల్సింది ఏంటంటే, దైవచిత్తాన్ని అర్థం చేసుకోవాలి. నీవేమిటో నిన్ను నీవు అర్థం చేసుకోవాలి. నీలోనే నిగూఢమైయున్న నీ శక్తి యుక్తులను వెలికి తీయాలి. వాటిని సానపెడుతూనే ఉండాలి. ఆ పని ప్రారంభిస్తే చాలు, గెలుపు నీ ముంగిట్లోకే వచ్చి నిలుస్తుంది. కొనసాగిస్తే చాలు, నీతోనే నిలుస్తుంది. ఆధ్యాత్మికంగా, నైతికంగా, భౌతికంగా, ఆ గెలుపునీదే కావాలి. ఆమేన్ ✶

## జూన్ గ.ను.క ఆల్‌కరెక్ట్‌గా వ్రాసిన వారి పేర్లు

జి.ప్రమీలాసుందర్-హన్మకొండ, కె.విమల-హైదరాబాదు, జి.విమలాప్రభావతి-బద్వేల్, స్వర్ణలతజోనాతాన్-ఒంగోలు, వై.కె.యల్.సుగుణమ్మ-బద్వేల్, కె.జె.మార్గరెట్‌పద్మాకర్-గుత్తి, వి.బ్యూలాజాన్-గుత్తి, యం.నిర్మలసుదీప్‌రెడ్డి-కొండపల్లి, ఆర్.జయమ్మలాబాను-గుంతకల్లు, ఎస్.లతమ్మ-కడప, ఎన్.మార్తమ్మ-గుంతకల్లు, బి.సరోజని-గుంతకల్లు, ఆర్.జి.సుశీలఆంద్రూస్-పుంగనూరు, యస్.యఫ్.ఇ.పుష్పావిలియం-కడప, జి.గ్రేసమ్మ-నంద్యాల, జె.సరోజిని-రాజమండ్రి, హెచ్.యం.డి.హెప్సిబా-ముత్యాలపాడు, ఎ.కె.జయమ్మ-అనంతపురం, బి.ఎన్.హేమలతపాల్-మదనపల్లి, రవణమ్మసోమయ్య-అనంతపురం, జి.పి.దాస్-సికంద్రాబాద్, ఎన్.బి.ప్రభావతి-బేస్తవారిపేట, మార్తాయేసుదాస్-జమ్మలమడుగు, పి.రఘురామయ్య-కర్నూలు, వై.పి.మేరిప్రమీల-హిందూపూర్, డి.డి.డి.ఎ.మణి-విశాఖపట్నం, పి.జానకీజాన్‌సన్-కడప, హెచ్.సరళమ్మ-గిద్దలూరు, డి.సామ్యూల్-మంగుళూరు, బి.అంభూజ-హన్మకొండ, సి.హెచ్.కస్తూరిభాయి-చీరాల, యమ్.రాజమ్మ-కడప, ఆర్.రాజమణి-తాడేరు, యమ్.మనితాప్రభాకర్-నంద్యాల, పి.యస్.భాగ్యవతమ్మ-గిద్దలూరు, టి.శాంతరత్నం-ఏలూరు, బి.అనీమేరి-హైదరాబాదు, జె.స్వామినాథన్-కుప్పం, డి.దానమ్మ-మదనపల్లి, బి.వనజకుమారి-జంగాం, ఎమ్.రఘూన్సీశాంతకుమార్-హన్మకొండ, పి.ఎలిజబెత్‌రాణి-గుంతకల్లు, డి.సుందరరాజన్-కుప్పం, వై.నిరీక్షణకుమార్-ఇనమనమెళ్ళూరు, ఆర్.దీవెనకుమారి-ఏలూరు, జి.రాజారావు-సామర్లకొట, కె.కనకమ్మ-హన్మకొండ, ఎ.శారాప్రభావతి-గుంతకల్లు, హెచ్.ఫోరెన్సమ్మ-చినదొర్నాల, బి.కెంపురత్నకుమారి-రంగంపేట, ఎమ్.స్వర్ణలత ఏంజెల్-పార్వతినగర్, హెచ్.భాస్కర్-బళ్ళారి, దేవకుటుంబరావు-విశాఖపట్నం, ఎమ్.దేవకృపాషడ్రక్-హన్మకొండ, జి.రిబ్కమ్మ-కలసపాడు, యమ్.సి.మనోహరమ్మ-అనంతపురం, టి.శోభారాణి-హన్మకొండ, జి.పాల్-కలసపాడు, కె.సులోచనదేవి-కర్నూలు, డి.దేవదానం-నంద్యాల, కె.ఎస్.లలితాభాయి-కలసపాడు, ఎమ్.సత్యన్నారాయణ-విశాఖపట్నం, వై.మాణిక్యం-కంచికచర్ల, కె.సుధారాణి-అమ్మపాలెం, కె.సశీలవెంకటరత్నం-హన్మకొండ, బి.ఏలీషారావు-గుడివాడ, బి.శాంతకుమారి-కడప, ఎస్.దేవమణి-ఎమ్మిగనూరు, ఎమ్.బి.కుమార్-చేగుంట, ప్రభావతిఇశ్రాయేల్-మదనపల్లి, జేన్‌ఆనంద్-చిత్తూరు, బి.చంద్రలీల-మదనపల్లి, బి.ఆశీర్వాదం-పిఠాపురం, కె.విజయ-తెనాలి, టి.యమ్.సుగుణ-శ్యాంపేట, ఐ.రత్నమయ్య-నంద్యాల.

ఒక తప్పుతో వ్రాసినవారు: కె.గ్రేస్‌విలియమ్-ఆనంద్‌బాగ్, యస్.ప్రమీలారాజన్-798, మేరివిజయకుమారి-బోయిలకింతాడు, యస్.జెమీమామాథ్యూస్-ఒంగోలు, డి.ప్రసాదు-రైల్వేకోడూరు, ఎస్.మెర్సిలారెపన్స్-కాకినాడ, పి.నయోమి-బెంగళూరు, బి.కృపానందం-నర్సాపురం, ఎస్.యెహోషువ-ఒంగోలు, కె.కృపానందం-చెన్నై, వి.యల్.ప్రసూనాంబ-గుంటుపల్లి.

# ప్రార్ధన వేదిక



## SMS ద్వారా ప్రార్థనా మనవులు

1. **డి.అబ్రాహం**
   ఆరోగ్యం (సీరియస్‌గా ఉంది) కోసం
2. **యస్.వి.రాఘవయ్య - విజయవాడ**
   ఆరోగ్యం దెబ్బతిన్నది. మంచి ఆరోగ్యం కోసం
3. **వినోద్ - ప్రకాశం జిల్లా**
   భార్య కోసం
4. **సంజన, రఘురాం**
   వివాహంలో దేవుని దీవెన కోసం
5. **ఉషా**
   సంతానం కోసం
6. **జయ**
   వివాహం కోసం
7. **లిజి**
   ఉద్యోగం కోసం
8. **శోభ**
   ప్రసవం తరువాత చూపు తగ్గింది, స్వస్థత కోసం
9. **రాజు**
   తాగుడు వ్యసనం నుండి విడుదల కోసం
10. **శామ్యూల్**
    ప్రమాదంలో బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టింది, స్వస్థత కోసం
11. **నితిలేష్**
    పంటిచిగురు వాపునుండి స్వస్థత కోసం
12. **కె.పరిమళ**
    క్యాన్సర్ చివరిదశ, స్వస్థత కోసం
13. **ఎడ్వర్డ్**
    క్యాన్సర్ స్వస్థత, కుటుంబ సమస్యలనుండి విడుదల కోసం
14. **ఉమ**
    (వివాహమై 16సం॥) సంతానం కోసం
15. **రవిబాబు**
    బ్రెయిన్ క్యాన్సర్ నుండి స్వస్థత కోసం
16. **పి.రఘురామయ్య - కర్నూలు**
    స్వంత ఇల్లు, కుమారుల ఉద్యోగాల కోసం
17. **పి.పార్వతి - విశాఖపట్నం**
    కిడ్నీలో రాళ్ళు ఉన్నాయి, స్వస్థత కోసం
18. **యస్.యఫ్.త్యాగరాజ్ - బెల్లంపల్లి**
    ప్రేమరాజ్, భానులకు సంతానం కోసం
19. **పి.అప్పలరాజు - విశాఖపట్నం**
    శేఖర్‌కు ఉద్యోగం, వివాహం కోసం
20. **దేవిడ్‌బాలప్ప - గుత్తి**
    కుమార్తె ఆరోగ్యం, ఇంటి పరిస్థితి మెరుగు కోసం
21. **పి.పార్వతి - విశాఖపట్నం**
    (పార్వతి) కిడ్నీలో రాళ్ళు, థైరాయిడ్ నుండి స్వస్థత కోసం
22. **పి.జి.కె.వినతి-ఎడ్లపాడు**
    అరోర, అబ్షాలోమ్‌ల ఉద్యోగం, వివాహాల కోసం
23. **శారాభాయి - రాజమండ్రి**
    3వ కుమారుడు నిద్రలేమి, మెంటల్ డిసార్డర్‌నుండి స్వస్థత కోసం
24. **టి.జ్ఞానమ్మ - సంగారెడ్డి**
    కుడికాలు బాధనుండి స్వస్థత కోసం
25. **యస్.అరుణకుమారి - నందికొట్కూరు**
    భర్త సుకుమార్, పిల్లలు స్పందన, స్వచంద్, అత్తయ్య కోసం
26. **బి.హెచ్.నాగేశ్వరరావు - గుంటూరు**
    పాల్‌విజయ్‌కుమార్ వివాహం జయకరంగా జరుగుట కోసం
27. **ఎ.నిర్మలకుమారి - శ్రీకాకుళం**
    ముగ్గురు పిల్లల ఉద్యోగాల కోసం
28. **బి.రాజారావు - గుంటూరు**
    మూడవకుమారిని కుటుంబజీవితం కోసం
29. **కె.ఆనందప్రేమరాజ్ - హైదరాబాదు**
    (ప్రభుత్వ) ఉద్యోగం కోసం
30. **పి.మాణిక్యం - విశాఖపట్నం**
    (మాణిక్యం) తలనరాల బలహీనతనుండి స్వస్థత కోసం

# మెదడుకు మేత

# విశ్వాసవీరుల జాబితా, పట్టణములు 30

కూర్పు – పాస్టర్ పి.ప్రతాప్ కుమార్

| | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బా | ఓ | దు | పౌ | కె | కో | రి | యె | ము | కు | బ్బ | దె | లు |
| దు | ష | మో | రే | లు | ఐ | ము | లు | కు | రా | దె | బె | తా |
| దీ | ఖై | స | షె | గు | ము | హా | బా | నో | బా | డా | చె | మా |
| వె | అ | స | ప్తు | లు | రా | బ్రా | బె | హ | దు | ర | నో | రు |
| బు | రా | మ్ను | మూ | ఓ | బే | అ | ల | హే | క్ష | కొ | వ | ము |
| రా | హా | బీ | ఖ | యే | ము | జే | బే | నై | తు | బా | హు | ల |
| కో | గ్గై | రా | చె | డ్గ | లు | లు | వై | సా | రూ | పా | నో | బ |
| ము | ల | గి | ద్యో | ను | ధా | ర్ధ | భ | ను | మై | బు | బా | గ్ని |
| యో | ర్మ | టో | త | న | న్యా | ర | య | రం | మ్సో | నో | కో | అ |
| కం | సే | చ | ద | లు | యే | శ్రా | ఇ | చ్చి | ప | స | రు | యా |
| వ | డ్డి | పు | ట్ట | ఫ్తా | ప్ర | త్యు | కా | దా | ము | ము | నా | కు |
| నో | హా | ఓ | కు | గొ | యొ | ఎం | కు | రై | వీ | క్షే | ల | ము |
| బ | ల | ము | హ | సిం | కా | ద | స్సా | ఎ | ట్టి | దు | ది | తో |
| గా | ము | ల | ఫ | న | గ్దా | వా | ఇ | చు | దు | పొం | సం | హిం |

1. అబ్రాహాము
2. ఇస్సాకు
3. యాకోబు
4. యోసేపు
5. మోషె
6. గిద్యోను
7. బారాకు
8. సమ్సోను
9. యొఫ్తా
10. దావీదు
11. సమూయేలు
12. హేబేలు
13. హానోకు
14. నోవహు
15. వాగ్దానఫలము
16. యెరికో
17. ఐగుప్తు
18. ఇశ్రాయేలు
19. ఖైదు
20. గొఱ్ఱెచర్మము
21. రాహాబు
22. తామారు
23. రూతు
24. పౌలు
25. సింహబలము
26. అగ్నిబలమున
27. ఖడ్గదార
28. కొరడాదెబ్బ
29. రంపములతో
30. హింసపొందుచు

**సూచనలు:**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింపబడవు.

2. పూర్తిచేసిన గ.ను.క. లు **వచ్చేనెల (సెప్టెంబర్ 15లోపు)** మాకందేటట్లు పంపాలి. ఇతర రాష్ట్రాల్లోని పాఠకుల సౌకర్యార్థం ఈ మార్పు చేశాము. గమనించగలరు.

పూర్తి చేసి పంపిన వారి పేరు.......................

ఊరి పేరు ..........................................

స్పందన కోడ్ నంబరు ..............................

## (మార్కు సువార్త నుండి)

## ఆగష్టు గళ్ళ నుడి కట్టు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | | | ⊗ | 2 | | 3 | |
| 4 | | | ⊗ | ⊗ | 5 | | 6 | | ⊗ |
| | ⊗ | 7 | | ⊗ | | ⊗ | | | ⊗ |
| ⊗ | ⊗ | 8 | | | | ⊗ | ⊗ | ⊗ | ⊗ |
| 9 | | ⊗ | | | | 10 | | | |
| | ⊗ | 11 | | | | ⊗ | 12 | | |
| | ⊗ | | ⊗ | ⊗ | | ⊗ | | ⊗ | |
| | ⊗ | 13 | | | | ⊗ | | ⊗ | |
| | ⊗ | 14 | | | | ⊗ | | ⊗ | |
| 15 | | | ⊗ | ⊗ | 16 | | | | 17 |

### అడ్డం

1. పంట పండినప్పుడు - - - - - వచ్చినదని సేద్యగాడు వెంటనే కొడవలిపెట్టి కోయునని చెప్పెను.
2. ఉపమానము లేక వారికి బోధింపలేదు గాని - - - - ఉన్నప్పుడు తన శిష్యులకు అన్నింటిని విశదపరచెను.
4. శిష్యులు వెళ్ళి పట్టణములోనికి వచ్చి ఆయన వారితో చెప్పినట్టు కనుగొని - - - ను సిద్ధపరచిరి.
5. మనమీలాటి కార్యములను ఎన్నడును చూడలేదని చెప్పుకొనుచు దేవుని - - - పరచిరి.
7. వారు - - వలె నుండి నడచుచున్నట్లుగా నాకు కనబడుచున్నారనెను.
8. యొర్దాను నదిలో అతని చేత - - - - పొందుచుండిరి.
9. అనేకులు ఆయన మీద అబద్ధసాక్ష్యము పలికినను వారి - - - ఒక దానికి ఒకటి సరిపడలేదు.
10. వారు - - - - - చొప్పునను ఏబదేసిమంది చొప్పునను పంక్తులు తీరి కూర్చుండిరి.
11. అతడు అది వరకు - - - చేయుచు వచ్చిన ప్రకారము చేయవలెనని అడుగగా..
12. ఇహమందు హింసలతోపాటు నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్కచెల్లెంద్రను - - లను పిల్లలను భూములను..
13. దాని కొమ్మ యింక లేతదై - - - నప్పుడు వసంత కాలము సమీపముగా ఉన్నదని మీకు తెలియును. (తలక్రిందులు)
14. వారు తనకు ఇరుకు కలిగింపకుండునట్లు - - - - యొకటి తనకు సిద్ధపరచవలెనని ఆయన తన శిష్యులతో చెప్పెను.
15. అతడు ఘనత వహించిన యొక - - - దేవుని రాజ్యము కొరకు ఎదురుచూచువాడు.
16. పూర్ణ బలముతోను ఆయనను ప్రేమించుటయు ఒకడు తన్నువలె తన - - - - - ప్రేమించుటయు సర్వాంగ హోమములన్నింటి కంటెను బలులన్నిటి కంటెను అధికమని ఆయనతో చెప్పెను.

### నిలువు

1. ఆయన వారి హృదయ కాఠిన్యమునకు దుఃఖపడి - - - తో వారిని కలియచూచి .. నీ చెయ్యి చాపుమని ఆ మనుష్యునితో చెప్పెను.
3. ప్రజలలో - - - కలుగునేమో అని పండుగలో వద్దని చెప్పుకొనిరి (తలక్రిందులు)
5. ఆందుకాయన దేవుని రాజ్య - - - (తెలిసికొనుట) మీకు అనుగ్రహించబడియున్నది.
6. ఆయన - - చలించియున్నదని చెప్పి ఆయనను పట్టుకొనబోయిరి.
9. మరియు ఆయన విశ్రాంతి దినమున పంటచేలలోబడి వెళ్ళుచుండగా శిష్యులు మార్గమున - - - - - వెన్నులు త్రుంచుచుండిరి.
10. అనేక దయ్యములను వెళ్ళగొట్టుచు - - - - అనేకులగు రోగులను స్వస్థపరచుచుండిరి.
11. అప్పుడాయన మీరు దేనిగూర్చి వారితో - - - చున్నారని వారినడుగగా..
12. ఆయన కొండెక్కి - - - - మైన వారిని పిలువగా వారాయన యొద్దకు వచ్చిరి.
17. పరిశుద్ధాత్మ విషయము దూషణచేయువాడెప్పుడును క్షమాపణ పొందక - - - - - చేసిన వాడైయుండునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. (తలక్రిందులు)

## సత్తెనపల్లి వాస్తవ్యులు పా॥యేసుదానం గారి కుమారుడు విజయ్, రూతుల వివాహపు ఫోటోలు


సందేశమిస్తున్న డా॥దేవ దండల


వివాహాన్ని జరిపిస్తున్న రెవ.వి.ఆర్కేమూర్తి


నవదంపతులు విజయ్-రూతు


పా॥యేసుదానం గారి కుటుంబ సభ్యులతో డా॥దేవ దండల


## అనాధ, పేద పిల్లలకు ఆశ్రయము

# లిటిల్ ఏంజల్స్ హోమ్



శ్రేష్ఠమైన ఈ చిన్న బిడ్డల పరిచర్యకోసం ప్రార్థించండి
ప్రభువు మిమ్మును ప్రేరేపిస్తే ఒక బిడ్డకు అయ్యే ఖర్చును మీరు ప్రతి నెల పంపవచ్చును

గమనిక :
చెక్కులు, డ్రాఫ్టులు పంపేవారు స్పందన SPANDANA పేరు మీద మాత్రమేపంపమనవి



చిన్న పిల్లలను ఆటంకపరచవద్దు, దేవుని రాజ్యము ఇలాటి వారిదే. (బైబిలు)

వివరాలకు : లిటిల్ ఏంజల్ హోమ్

స్పందన, పోస్ట్‌బాక్స్ 815, ESI హాస్పటల్ రోడ్, గుణదల, విజయవాడ - 520 004

RNI No: 32106/76 Regd No. VJ/057/2009-11
Licenced to post without pre-payment No. PMG/VJ/PWPP/21/2009-11




దేవుని మహాకృప అనేకమంది ప్రభువు బిడ్డల ప్రార్ధనా ఫలితంగా విజయవాడ, గుణదలలో ప్రార్ధన మందిరనిర్మాణం ప్రారంభమయింది. ఈ స్థలంలో నీళ్ళ కోసం బోరింగ్ వేయించటానికి ప్రభువు కృప చూపారు. దాదాపుగా 50వేల రూపాయలు దానికి ఖర్చయింది. దాని తరువాత పునాదులు, ప్లింత్ బీములు అయిపోయి పిల్లర్ వేయటానికి సిద్ధంగా ఉంది. ఈ పని కోసం సుమారుగా ఇప్పటికే రెండున్నర లక్షల రూపాయలు ఖర్చయింది. మా ప్రియ పాఠకులు ఈ బిల్డింగ్ నిర్మాణం కోసం ప్రార్థించాలని మనవి చేస్తున్నాము. అనేకసార్లు మీకు తెలియజేసినట్టుగా ఇందులో ఓ ప్రార్ధనా మందిరం, అనాథ-పేద పిల్లల ఆశ్రమము, పార్సనేజ్ ఒకటి ఉంటాయి. మొత్తం బిల్డింగ్‌కు దాదాపు 25 లక్షలు అవుతాయని ఇంజనీర్ల అంచనా!

ప్రభువుకు అసాధ్యమైనది లేదు. గత కాలంలో అనేక విషయాలకు సహకరించిన మా స్పందన కుటుంబ సభ్యుల ప్రార్థనల ద్వారా మన కోసం అద్భుతాలు చేస్తాడు. ప్రేరేపించబడిన వారు మీరు పంపే కానుక ఎంత పెద్ద మొత్తమైనా ఫరవాలేదు, ఎంత చిన్నమొత్తమైనా పరవాలేదు. 'దేవుని ఇంటిని మీరు కట్టండి, మీ ఇంటిని దేవుడు కడతాడు' అన్నాడు ఓ భక్తుడు. ఈ పరిచర్యలో మీలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని ప్రత్యేకంగా మనవి చేస్తున్నాము.

మరిన్ని వివరాలకు **డా॥దేవసహాయం దండల**
స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక, ఇయస్ఐ హాస్పటల్ రోడ్, గుణదల, విజయవాడ-520004
ఫోన్స్ - 94901 13300, 0866-2456547, (డా॥దేవ పర్సనల్ ఫోన్) 99483 35222

## ప్రత్యేక సంచిక

**వచ్చేనెల సెప్టెంబర్ 2011 సంచిక 'పరమపదించిన దైవజనులు ఆయిచార్య ఆరార్కే' గారి స్మృతికి చిహ్నంగా ప్రచురించనున్నాము. ఆరార్కే గారికి మీ శ్రద్ధాంజలి, వారితో మీకున్న ఆత్మీయ అనుభవాలు రాసి పంపండి. మీ వద్ద దైవజనులు ఆచార్య ఆరార్కే గారితో తీసుకున్న ఫోటోలు ఉంటే అవికూడా పంపించండి. వాటిని ఈ సంచికలో ప్రచురిస్తాము.**